
J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 46 18.04.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



## కాకాణి గారూ!..

# ఏ కలుగులో ఉన్నారు సారూ!

**➤ సోమిరెడ్డి వ్యంగ్యాస్త్రాలు**



'తానే తోపునన్నాడు..తురుమునన్నాడు...ఇప్పుడు ఏ కలుగులో నక్కాడో తెలియడం లేదు'..అంటూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాజీమంత్రి కాకాణినుద్దేశించి వ్యంగ్యబాణాలు విసిరారు. వెంకటాచలంలో ఇటీవల జరిగిన సర్వేపల్లి ఏఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డితో పాటు కార్యవర్గానికి ఏర్పాటుచేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ, వైకాపా నాయకుడు.. మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తీరును దుయ్యబట్టారు. కాకాణి స్వస్థలమైన తోడేరుకు పక్కనే ఉన్న ఊరిలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రమేయం లేకుండా వందల కోట్ల విలువైన క్వార్ట్జ్ కొల్లగొట్టడం సాధ్యమేనా అని ఆయన ప్రశ్నించారు. వరదాపురం రుస్తుం మైన్‌లో అక్రమ మైనింగే జరగలేదని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చెప్పడం సిగ్గుచేటని, ఊళ్లకు ఊళ్లను నామరూపాల్లేకుండా చేసే ప్రమాదకరమైన పేలుడు పదార్థాలు బయటపడిన రోజు ఈ ఎమ్మెల్సీ ఏం చేస్తున్నాడోనని ఆయన విమర్శించారు. వైకాపా పాలనలో సర్వేపల్లిలో అనేక అక్రమాలు జరిగాయని, పొదలకూరులోని టీడీపీ మండల నాయకులు అనేకమందిపై వైకాపా హయంలో అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపారని, ఆ అరాచకాల వల్ల కొంతమంది ఆస్తులు కూడా కోల్పోయారని ఆయన అన్నారు.

**కాకాణి అక్రమాలకు అంతే లేదు...**

వైసీపీ ఐదేళ్ల పాలనలో కాకాణి చేసిన అక్రమాలు, అవినీతి, అరాచకాలకు అంతే లేదని, తనమీద కూడా కేసులు పెట్టారని సోమిరెడ్డి చెప్పారు. మొన్న క్వార్ట్జ్ అక్రమ మైనింగ్‌పై కాకాణిపై పోలీసులు కేసు నమోదు చేస్తే, తాను అదిరేదీ బెదిరేదీ లేదన్న కాకాణి, ఇప్పుడు ఎక్కడ దాక్కున్నాడోనని ఆయన ఎద్దేవా చేశారు. వైకాపా పాలనలో తనపై ఆనందయ్య మందు విషయంలో అక్రమ కేసు బనాయించినా తాను కాకాణిలా పారిపోలేదని, పోలీసులను రమ్మని ఆహ్వానించా..వచ్చి అరెస్టు చేసుకుని తీసుకెళ్లమని చెప్పా. అయితే, పోలీసులకు కూడా అది తప్పుడు కేసు అని తెలిసి నా జోలికి రాలేదు'...అని సోమిరెడ్డి తెలిపారు. గతంలో ఆనం, నేదురుమల్లి కుటుంబాలతో ఎన్నో రాజకీయ పోరాటాలు చేశాం.. కానీ ఏ రోజూ కేసులు పెట్టలేదు..పెట్టించుకోలేదని ఆయన అంటూ, వైకాపా హయాంలో అక్రమ కేసులతో పాటు, పంచ భూతాలు కూడా దోపిడీకి గురయ్యాయన్నారు.

# గండిపాలెం ప్రాజెక్టు సాధకుడు.. చెంచురామయ్య సేవలు చిరస్మరణీయం



మాజీ ఎమ్మెల్యే పొన్నుబోయిన చెంచురామయ్య సేవలు చిరస్మరణీయమని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కొనియాడారు. మెట్ట ప్రాంత ప్రజల సమస్యల సాధనకు ఎనలేని కృషిచేస్తూ, గండిపాలెం రిజర్వాయర్‌ను సాధించిన దివంగత నేత చెంచురామయ్య 22వ వర్ధంతి కార్యక్రమం, ఇటీవల ఉదయగిరిలో ఆయన కుమారుడు జడ్పీ మాజీ ఛైర్మెన్ చంచలబాబుయాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకర్ల సురేష్-ప్రవీణ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత, చెంచురామయ్య చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కాకర్ల మాట్లాడుతూ, ఆదర్శ నేత చెంచురామయ్య స్ఫూర్తితో అందరం కలిసికట్టుగా ఉదయగిరిని అభివృద్ధి పథంలో నడిపిద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. సుమారు 50 సంవత్సరాల క్రితం బీసీ ఎమ్మెల్యేగా గెలుపొంది ఉదయగిరి మెట్ట ప్రాంతంపై అసెంబ్లీలో గళం విప్పి, ఎండిపోతున్న పంటపొలాలకు నీరందించాలనే లక్ష్యంతో గండిపాలెం రిజర్వాయర్‌ను సాధించడం చాలా గొప్ప విషయమన్నారు. అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు మంత్రివర్గంలో మంత్రిగా అవకాశం వచ్చినా, ఆ పదవి కంటే తమ ప్రాంతప్రజల అభ్యున్నతే ముఖ్యమని చెప్తూ, గండిపాలెం రిజర్వాయర్, నక్కలగండి, బసినేనిపల్లి రిజర్వాయర్ ఏర్పాటుచేయాలని పట్టుబట్టి ఆ కాలంలోనే వాటిని సాధించారన్నారు. ఆ మహనీయుని విగ్రహాలను గండిపాలెం రిజర్వాయర్ ప్రాజెక్టు వద్ద, ఉదయగిరిలోని ట్యాంకుబండపై ఏర్పాటు చేసుకొని వారి సేవలను మనమంతా స్మరించుకోవాలన్నారు. మాజీ జడ్పీ ఛైర్మెన్ చంచలబాబుయాదవ్ మాట్లాడుతూ, నాటి కాలంలో తమ తండ్రి చెంచురామయ్య, ఇప్పుడు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మెట్ట ప్రాంత ప్రజల సమస్యల సాధనకు అసెంబ్లీలో గళం విప్పారని, ఉదయగిరి అభివృద్ధి కాకర్లతోనే సాధ్యమని అన్నారు. టీడీపీ మండల కన్వీనర్ సిహెచ్ బయన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి ఎస్కే రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# 'రోడ్డు భద్రత' పటిష్టంగా ఉండాలి

**- జేసీ కార్తీక్**



నెల్లూరు నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు త్వరగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఇటీవల జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన రోడ్డు భద్రత కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రోడ్డు భద్రతా కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో.. ప్రమాదాల నివారణకు అన్ని భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు నగరంలో ట్రాఫిక్ రద్దీ పెరిగిపోతున్న దృష్ట్యా ఏసి కూరగాయల మార్కెట్ సెంటర్, జిల్లా పోలీసు కార్యాలయం సెంటర్, కెవిఆర్ జంక్షన్, కనకమహల్ సెంటర్, రామలింగాపురం, విఆర్‌సి ప్రధాన కూడళ్లలో సిగ్నల్ వ్యవస్థను మే నెల మొదటివారంలోగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో ఏర్పాటుచేసిన సిగ్నల్స్ వ్యవస్థలోని లోటుపాట్లు మళ్లీ పునరావృతం కాకుండా పకడ్బందీగా సిగ్నల్ పాయింట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. నగరంలో ఇంకా సిగ్నల్ పాయింట్ల ఏర్పాటుకు అవసరమైన ప్రదేశాలను ఎంపిక చేయాలని సూచించారు. బుజబుజనెల్లూరు నుంచి కోవూరు వరకు జాతీయరహదారిపై ప్రమాదాలు జరుగుతున్న 11 ప్రాంతాల్లో సోలార్ లైటింగ్‌ను ఏర్పాటు చేయాలని ఆయన హైవే అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జేసీ కార్తీక్ పిలుపునిచ్చారు.

# ప్రాంగణ ఎంపికల్లో..ఇందుప్రియ ప్రతిభ

**ఏడాదికి 27 లక్షల వేతనంతో ఎంపికైనందుకు రామ్‌కుమార్ అభినందన**



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇటీవల జరిగిన ప్రాంగణ ఎంపికల్లో కె. ఇందుప్రియ తన ప్రతిభను నిరూపించుకుంది. నెలకి లక్ష రూపాయల వేతనం, ఇంటర్న్‌షిప్ తర్వాత ఏడాదికి 27 లక్షల రూపాయల వేతనం అందుకోనుంది. దీంతో తమ కళాశాల విద్యార్థిని అత్యుత్తమ రీతిలో ప్రాంగణ ఎంపికల్లో తొలి రెండు రౌండ్‌లలో మంచి మార్కులు సాధించి తన సత్తా చాటినందుకు ఎన్‌బికెఆర్ కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆ విద్యార్థినిని అభినందించారు. ఇందుప్రియ తమ కళాశాలలో బీటెక్ మూడవ సంవత్సరం సిఎస్‌ఇ విభాగంలో చదువుకుంటోందని, ఎంతో పేరుగడించిన 'వాల్‌మౌంట్ కంపెనీ' వారు నిర్వహించిన ఎంపికల్లో ఇందుప్రియ ఎంపిక కావడం అభినందనీయమని ఆయన అన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, మొదటి రౌండ్‌లో ఆన్‌లైన్ అసెస్‌మెంట్ పరీక్షల్లో మొత్తం 40 మంది విద్యార్థినులు, రెండవ రౌండ్‌లో 20 మంది షార్ట్‌లిస్ట్ అయ్యారని, ఈ రెండు రౌండ్‌లలో అధికమార్కులు సాధించి ఇందుప్రియ వాల్‌మౌంట్ కంపెనీలో ఉద్యోగానికి ఎంపిక కావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి డా.ఎస్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## రోబోటిక్ సాయంతో..

# మోకాలి మార్పిడి చికిత్సలు

**'అపోలో'లో జయప్రదంగా ఆపరేషన్లు**




నేటి ఆధునిక కాలంలో అత్యంతాధునికమైన రీతిలో రోబోటిక్ సహాయంతో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలను నిర్వహిస్తున్నామని నెల్లూరు అపోలో స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు చెప్పారు. మోకాలి మార్పిడి ఆపరేషన్లు చేయించుకునేవారికి అందుకు అవసరమైన పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నెల్లూరులో అపోలో హాస్పిటల్‌ను ప్రారంభించి పదేళ్ల పూర్తయిన సందర్భంగా, ఆసుపత్రిలో ఇటీవల జరిగిన పత్రికా విలేకర్ల సమావేశంలో అపోలో హాస్పిటల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరాం సతీష్, ఆర్థోపెడిక్ సీనియర్ సర్జన్లు డాక్టర్ వివేకానందరెడ్డి, డాక్టర్ శశిధర్‌రెడ్డి మాట్లాడారు. రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా చేయడంలో నెల్లూరు అపోలో హాస్పిటల్ అగ్రగామిగా ఉంటోందన్నారు. శస్త్ర చికిత్స తర్వాత నొప్పి కూడా చాలా తక్కువగా ఉంటుందని, వేగంగా కోలుకోవచ్చునని చెప్పారు. శస్త్ర చికిత్స తర్వాత ఆసుపత్రిలో ఎక్కువరోజులు ఉండాల్సిన అవసరం లేదన్నారు. కేవలం 2లక్షల 50వేల ఫీజుతోనే మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నామని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. యూనిట్ హెడ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్‌గా..హుస్సేన్‌సాహెబ్

తెలుగుగంగ ప్రాజెక్టు ప్రత్యేక కలెక్టర్‌గా డిప్యూటీ కలెక్టర్ డి.హుస్సేన్‌సాహెబ్‌ను నియమిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులిచ్చింది. గతంలో ఆయన నెల్లూరు ఆర్డీఓగా కూడా పనిచేశారు. ఈ స్థానంలో విధులు నిర్వహిస్తున్న శీనానాయక్‌ను ప్రభుత్వం ఇటీవలే బదిలీ చేసింది.

## 'మెప్మా' పీడీగా..లీలారాణి

నెల్లూరుజిల్లా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా డిప్యూటీ కలెక్టర్ బి.లీలారాణిని ప్రభుత్వం నియమించింది. రాజంపేటలో భూసేకరణ విభాగం ప్రత్యేక అధికారిగా ఉన్న ఆమె, తాజాగా డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో నెల్లూరుజిల్లాలో నియమితులయ్యారు. గతంలో ఆమె గూడూరు, కోట మండలాల్లో తహశీల్దారుగా కూడా పనిచేసి ఉన్నారు.

## ఇంటింటి ప్రచారంలో..కాంగ్రెస్

గాంధీజీ మార్గంలో రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని, డా.అంబేద్కర్ ఆశయాలను సాధిస్తామని జిల్లా కాంగ్రెస్ నాయకులు ఈనెల 14న పాదయాత్ర చేస్తూ, ఆమేరకు ఇంటింటి కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్‌పార్టీ జాతీయ నాయకుడు కె.రాజు సూచనలతో నెల్లూరు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలో నాయకులు పాదయాత్ర నిర్వహించి, ఇంటింటా ప్రచారం చేశారు.

J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16
THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 46 18.04.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# అలుపెరగని యోధుడు ప్రగతి రథ సారధుడు

## బాబు @ 75







- నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా అరుదైన ఘనత
- జాతీయ స్థాయిలో చక్రం తిప్పుతున్న తెలుగు నేత

ఒత్తిళ్ల పొత్తిళ్ల మధ్య ఎదిగిన మేరునగధీరుడు, ఆటుపోట్లనే అవకాశాలుగా మార్చుకున్న యోధుడు, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అసలుసిసలు కార్యదక్షుడు, అపర చాణుక్యుడు, రాజకీయ దురంధరుడు, చరిత్రమెచ్చిన చరితార్థుడు, జనం మెచ్చిన నాయకుడు, ఒక్కమాటలో చెప్పాలంటే, సాధకుడి రూపంలో ఉన్న రాజకీయ సైనికుడు, భావితరాలు చూడాలనుకునే సమాజాన్ని ముందే మనోఫలకంపై ఆవిష్కరించగలిగే దార్శనికుడు, ఆయనే తెలుగుతల్లి ముద్దుబిడ్డ, ఆంధ్రుల ఆశాకిరణం, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు. ..12లో


శ్రీరస్తు! శుభమస్తు!!





## శ్రీ శిరిడి సాయిబాబా వారి 17వ వార్షికోత్సవం మరియు శ్రీ యోగాంజనేయస్వామి వారి 12వ వార్షికోత్సవ మహాకుంభాభిషేకమునకు ఆహ్వానము

కొత్తూరు గ్రామం, ఇందుకూరుపేట మండలం, నెల్లూరుజిల్లా.

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం చైత్రమాసం కృష్ణపక్షం సప్తమి ఆదివారం నుంచి దశమి బుధవారం వరకు అనగా
తేది. 20.04.2025 నుంచి 23.04.2025 వరకు.

### శ్రీ శిరిడి సాయిబాబా వారి కార్యక్రమముల వివరములు

**తేది : 20.04.2025 ఆదివారం**

**ఉదయం 8.30 ని॥ల నుంచి మధ్యాహ్నం 12.30 ని॥ల వరకు**
శ్రీ పరివార దేవతా సహిత శ్రీ శిరిడిసాయి బాబా ప్రార్థన, గణపతి పూజ, పుణ్యాహవచనం, దేవనాంది, కంకణధారణ, మహా సంకల్పం, బ్రహ్మకూర్చ హోమం, అష్టద్రవ్య గణపతి హోమం, పూర్ణాహుతి మరియు మంగళహారతి.

**సాయంత్రం 4.30 ని॥ల నుంచి రాత్రి 9.00 గం॥ల వరకు**
మండల రచన, బ్రహ్మకలశ స్థాపన పూజ, రాక్షోఘ్న హోమం, ప్రాసాద వాస్తు హోమం, స్నపన కలశ స్థాపన, కల్పోక్త పూజ, దిగ్బలి, క్షేత్రపాల బలి మరియు మహా మంగళహారతి మొదలగునవి.

**21.04.2025 సోమవారం**

**ఉదయం 8.30 ని॥ల నుంచి మధ్యాహ్నం 12.30 ని॥ల వరకు**
దేవతా ప్రార్థన, స్వస్తి పుణ్యాహం, కుండ సంస్కారం, అగ్ని జననం, మహాగణపతి, దత్తాత్రేయ, అయ్యప్ప నవగ్రహ, శ్రీ శిరిడి సాయిబాబా వార్ల మూలమంత్ర హోమం, నవగ్రహ హోమం, అధివాస హోమం, తత్వశక్తి హోమం, కళావృద్ధి హోమం, మహా పూర్ణాహుతి, పంచామృతాభిషేకం, కుంభాభిషేకం, బ్రహ్మ కలశాభిషేకం మరియు మహామంగళ హారతి మొదలగునవి.

**సాయంత్రం 6.30 ని॥లకు**
ప్రాకార ఉత్సవం, అష్టావదాన సేవ మరియు మహా మంగళహారతి మొదలగునవి.

### శ్రీ యోగాంజనేయస్వామి వారి కార్యక్రమముల వివరములు

**తేది : 22.04.2025 మంగళవారం**

**ఉదయం 8.00 గం॥ల నుంచి 12.00 గం॥ల వరకు**
శ్రీ యోగాంజనేయ స్వామి వారి ప్రార్థన, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, అష్టమూర్తి ప్రార్థన, మహాసంకల్పం, ప్రాయశ్చిత్తహోమం, అధర్వ శీర్ష మహా గణపతి హోమం, పూర్ణాహుతి మరియు మంగళహారతి.

**సాయంత్రం 4.30 ని॥ల నుంచి రాత్రి 9.00 గం॥ల వరకు**
స్నపన మండల రచన, గణపతి పూజ, మహా కుంభస్థాపన, బ్రహ్మ కలశ పూజ, రాక్షోఘ్న పారాయణ హోమం, ప్రాసాద వాస్తు హోమం, ఇంద్రాది దిగ్బలి మరియు మహా మంగళహారతి.

**23.04.2025 బుధవారం**

**ఉదయం 8.00 ని॥ల నుంచి మధ్యాహ్నం 12.30 ని॥ల వరకు**
నాగదేవతలకు అభిషేకము మరియు పూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, వేద పారాయణం, అగ్ని స్థాపన, ఆంజనేయ మూల మంత్ర వాచనం, అధివాస హోమం, తత్వశక్తి హోమం, రుద్ర హోమం, శ్రీరామ తారక హోమం, శ్రీ కళావృద్ధి హోమం, వసోర్ధార మహా పూర్ణాహుతి, యోగాంజనేయ స్వామికి పంచామృతాభిషేకం, అష్టోత్తర శత కలశాలతో అభిషేకం.
**శిఖర మహాకుంభాభిషేకం,** మహా మంగళహారతి మరియు ఆశీర్వాదం మొదలగునవి.

**సాయంత్రం 6.30 ని॥లకు**



హనుమత్ ఉపాసకులు కీ॥శే॥ ఎం.ఎస్.రామారావు గారి మనుమడు **డా॥ పి.శ్రీనివాసస్వామి** వారిచే 11 పర్యాయములు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణము ఏర్పాటు చేయడమైనది.

శుభం!

ఆహ్వానించువారు : శ్రీ కలికి కోదండరామిరెడ్డి - శ్రీమతి కలికి శ్రీలత, ధర్మకర్తలు



# బీద రవిచంద్ర ప్రమాణస్వీకారం

రెండోసారి శాసనమండలి సభ్యునిగా ఎన్నికైన బీద రవిచంద్ర ఈనెల 16న ప్రమాణ స్వీకారం చేశారు. అమరావతిలోని సచివాలయం ఛాంబర్‌లో శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఆయనతో ప్రమాణం చేయించారు. అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్, పలువురు ఎమ్మెల్సీలు, నాయకులు బీద రవిచంద్రకు శుభాకాంక్షలు తెలిపి, రవిచంద్ర దంపతులను వారు ఘనంగా సన్మానించారు.

# జొన్నవాడ బ్రహ్మోత్సవాలకు స్తంభప్రతిష్ఠ

జొన్నవాడలోని శ్రీ మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి దేవాలయంలో బ్రహ్మోత్సవాల నిర్వహణకు శుభముహూర్తం నిర్ణయించి ఆమేరకు ఈనెల 16వ తేదిన ఆలయంలో శాస్త్రోక్తంగా స్తంభప్రతిష్ఠ చేశారు. మే 17 నుంచి 27వతేదీ వరకు వైభవంగా బ్రహ్మోత్సవాలను నిర్వహించాలని సంకల్పించారు. ఆలయ ఇఒ ఏవీ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో, వేదపండితుల నేతృత్వంలో పూజలు జరిగాయి. తొలుత గణపతిపూజ అనంతరం స్వామి-అమ్మవార్లకు విశేష పూజలు చేశారు.

# రైతులకు పుష్కలంగా సాగునీరు అందించాలి

- జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో ప్రశాంతమ్మ




జిల్లాలో రైతులు పూర్తిస్థాయిలో పంటలు పండించుకునేందుకు, వారికి పుష్కలంగా సాగునీరు అందించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. ఈనెల 17న నెల్లూరులో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా సాగునీటి సలహామండలి సమావేశంలో ఆమె పాల్గొని రైతుల సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా, కనిగిరి రిజర్వాయర్, జాఫర్ సాహెబ్ కాలువ పరిధిలో రబీ సీజన్లో రైతులు సాగుచేసే దాదాపు లక్షా 30వేల ఎకరాలకు ఆయకట్టు చివరి ఎకరా వరకు సాగునీరు అందించాలని మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఇరిగేషన్ అధికారులకు ఆమె విజ్ఞప్తి చేశారు. నీటిపారుదల అధికారులు, నీటి సంఘాల అధ్యక్షులతో పాటు రైతులతో సమన్వయం చేసుకొని ప్రణాళికా బద్ధంగా నీటి పంపిణీ చేయాలని, నీటి వృధాను అరికట్టి, అధిక దిగుబడి సాధనకు కృషి చేయాలని ఆమె సూచించారు. పెన్నా డెల్టా పరిధిలోని కోవూరు నియోజకవర్గంలో ఈ సీజన్‌లో లక్షా 90 వేల 3 మెట్రిక్ టన్నుల దిగుబడి సాధించిన కోవూరు రైతాంగాన్ని ఆమె అభినందించారు. ఖరీఫ్ సీజన్‌లో కోవూరు రైతులు 500 కోట్ల రూపాయల టర్నోవర్ సాధించడం హర్షదాయకమన్నారు. కనిగిరి రిజర్వాయర్ ప్రధాన గేట్లు పూర్తిగా పాడైపోయాయని, వీలైనంత త్వరగా వాటికి మరమత్తులు చేయించే దిశగా ప్రయత్నించాలని ఆమె మంత్రిని, అధికారులను కోరారు. క్షేత్రస్థాయిలో నీటిని పంపిణీ చేసే లష్కర్ల వ్యవస్థను పటిష్టం చేయాల్సిన అవసరం వుందని, గత కొన్నేళ్ళుగా పెండింగ్‌లో ఉన్న లష్కర్ల జీత భత్యాల బకాయిల సమస్యను ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కరించాలని మంత్రి ఆనంని కోరారు. సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించి నీటి పంపిణీలో రైతులకి భాగస్వామ్యం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ఈ సందర్భంగా ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి ఆనంతో పాటు, జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కాకర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# భూమన నిందలపై నేతల మండిపాటు

## టీటీడీ గోశాలపై ఆరోపణలు అవాస్తవమన్న నాయకులు

**తిరుమల తిరుపతి దేవస్థానానికి సంబంధించిన గోశాలలో ఆవులు మరణించాయంటూ ఇటీవల టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి చేసిన ఆరోపణలపై నెల్లూరు నేతలు పెద్దఎత్తున ధ్వజమెత్తారు. ఆ ఆరోపణలు ఉత్త అవాస్తవాలని, వాటిని నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సహజంగా జరిగిన గోవుల మరణాలతో టీటీడీ ప్రతిష్ట దిగజార్చేలా వ్యాఖ్యలు చేస్తున్నారని, మత విద్వేషాలు రెచ్చగొట్టి అలజడి సృష్టించేందుకు భూమన కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.**

### భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్న భూమన - మంత్రి నారాయణ



కోట్లాదిమంది భక్తుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా భూమన టీటీడీపై లేనిపోని అభాండాలు వేస్తున్నారని, అన్యమతస్తుడిగా ఉన్న భూమనపై గతంలో అనేక ఆరోపణలు కూడా వచ్చాయని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మండిపడ్డారు. టీటీడీ గోశాలలో ఆవుల మరణాలపై వైసీపీ దుష్ప్రచారం తగదన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి అలజడి సృష్టించేందుకు భూమన కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామిపై భూమన అనేక విమర్శలు చేశారని, కోటిమంది దేవతలతో సమానంగా భావించే గోమాతలపై ఇప్పుడు కూడా అసత్య ప్రచారం చేస్తున్నారని, ఇది మంచిపద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోశాలలో ఆవులు ముసలితనంతోపాటు ఈనేటప్పుడు కూడా వివిధ వ్యాధులతో చనిపోతుంటాయని, గడిచిన మూడునెలల్లో ఇలాంటి కారణాలతో 40 ఆవులు మృత్యువాత పడ్డాయని, గత ఐదేళ్ల గణాంకాలు కూడా ఇదే స్పష్టం చేస్తున్నాయని ఆయన వివరించారు. కానీ మూడు నెలల్లోనే వంద గోవులు చనిపోయాయంటూ కరుణాకర రెడ్డి అసత్య ప్రచారం చేస్తూ టీటీడీతో పాటు ప్రభుత్వాన్ని కూడా అప్రతిష్టపాలు చేసేలా మాట్లాడుతున్నారన్నారు. టీటీడీ గోశాలలో 260మందికిపైగా ఉద్యోగులు పనిచేస్తూ గోవుల సంరక్షణను సక్రమంగా చూసుకుంటుంటే, టీటీడీ ఏమీ పట్టించుకోవడం లేదంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, గత ప్రభుత్వ హయాంతో పోల్చుకుంటే ఇప్పుడు గోశాలకు ఎన్నో అధునాతన సదుపాయాలు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రతిరోజూ శుభ్రపరచడం, బ్లీచింగ్ చేయడం జరుగుతోందని చెప్పారు. సహజ మరణం పొందిన ఆవులకు పోస్టుమార్టం చేయడం ఏ ప్రభుత్వ హయాంలోనూ జరగలేదన్నారు. తాను నాస్తికుడినని గతంలో స్వయంగా ప్రకటించుకున్న భూమన, ఆ తర్వాత టీటీడీ ఛైర్మన్‌గా పనిచేసిన కాలంలో ఎన్నో రకాల కుంభకోణాలకు పాల్పడ్డారన్నారు. ప్లాస్మా టీవీల కుంభకోణం, తాళిబొట్ల కుంభకోణం, టిక్కెట్లు అమ్ముకోవడం, డాలర్ల మాయం చేయడం వంటి దుశ్చర్యలకు పాల్పడ్డారని. కోవిడ్ సమయంలో స్వామివారి ప్రసాదాలను కూడా దారిమళ్లించి అపచారాలకు పాల్పడిన చరిత్ర కరుణాకరరెడ్డిదని నారాయణ తూర్పారబట్టారు. కరుణాకరరెడ్డి తన అవినీతి, అక్రమాలతో టీటీడీ ఖజానాను దారిమళ్ళించి కమిషన్లు కొట్టేశారని, చేసిన తప్పుడు పనులకు విధులకు దూరమైన హరనాథ్‌రెడ్డి అనే వ్యక్తి కోసం టీటీడీపై తప్పుడు ప్రచారాలు చేస్తారా అని ఆయన ప్రశ్నించారు.

### గోమాతలతో.. గోవిందుడితో ఆటలొద్దు!

#### - మాజీమంత్రి సోమిరెడ్డి




గోమాతలతో.. గోవిందుడితో ఆటలొద్దని మాజీమంత్రి, సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వైకాపా నేతలకు హితవు పలికారు. తిరుమల తిరుపతి దేవస్థానాన్ని రాజకీయాల్లోకి లాగడం వైకాపా వారికి అలవాటుగా మారిందన్నారు. గతంలో చంద్రబాబునాయుడి ఇంట్లో పింక్ డైమండ్ ఉందని నోటికొచ్చిన అబద్ధాలు చెప్పారని, తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామికి పింక్ డైమండే లేదని ఆ తర్వాత విచారణలో తేలిందని ఆయన గుర్తుచేశారు. ఇప్పుడేమో టీటీడీ గోశాలలో గోవులు చనిపోయాయని దుష్ప్రచారానికి తెరలేపారని, కూటమి ప్రభుత్వం వచ్చాక టీటీడీకి మంచిపేరు రావడాన్ని వైసీపీ నేతలు సహించలేకపోతున్నారని ఆయన అన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుమలలో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తోందన్నారు. వైకాపా పాలనలో టీటీడీని భ్రష్టుపట్టించిన భూమన కరుణాకర్ రెడ్డి ఇప్పుడు గోమాతల పేరుతో రాజకీయాలు చేయడం దుర్మార్గమన్నారు. గోశాలలో గోవుల సంరక్షణపై టీటీడీ అత్యంత శ్రద్ధ చూపుతోందని, అయితే వైకాపా వారు అది సహించలేక లేనిపోని దుష్ప్రచారాలు చేస్తున్నారని, తిరుమలని అప్రదిష్టపాల్జేసేందుకు ఎవరు ప్రయత్నం చేసినా ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

### పచ్చి అబద్ధాలు - టీటీడీ సభ్యురాలు.. ప్రశాంతిరెడ్డి



తిరుమల తిరుపతి దేవస్థానాల గోశాలలో వంద ఆవులు చనిపోయాయన్న కరుణాకర్ రెడ్డి మాటలు పచ్చి అబద్ధాలని కోవూరు శాసన సభ్యురాలు.. టీటీడీ పాలకమండల సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కొట్టిపారేశారు. ఎక్కడో చనిపోయిన గోమాతల ఫోటోలను మార్ఫింగ్ చేసి, టీటీడీ గోశాలపై దురుద్దేశాలు ఆపాదిస్తున్నారని ఆమె మండిపడ్డారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టకు భంగం కలిగించాలని ప్రయత్నించిన వారెవరైనా ఆ దేవదేవుడి ఆగ్రహానికి గురికాక తప్పదని ఆమె స్పష్టం చేశారు. సకల దేవతలకు ప్రతిరూపమైన గోమాతలపై దుష్ప్రచారం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. టీటీడీ గోశాలలో గోవుల సంరక్షణ కోసం దాదాపు 260 మంది పని చేస్తుంటారని, వృద్ధాప్యం కారణంగా గోవుల సహజ మరణాలు సర్వ సాధారణ విషయమని, ఇందులో భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె అన్నారు. గోవుల సహజ మరణాలపై అసత్య ప్రచారాలు చేస్తూ, టీటీడీ ప్రతిష్టకు భంగం కలిగించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

### మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకే.. - ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, టీటీడీ ప్రతిష్టకు భంగం కలిగిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ అన్నారు. శ్రీ వేంకటేశ్వరస్వామిపై, హిందూ సంప్రదాయాలపై గతంలో భూమన చేసిన విమర్శలను ఆయన ప్రస్తావిస్తూ, దేవతా స్వరూపంగా భావించే గోమాతలపై కూడా పనిగట్టుకుని భూమన అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. గోశాలలోని 2668 ఆవులకు జియో ట్యాగ్ చేసి ప్రతిరోజు పర్యవేక్షించడం జరుగుతుంటే, ఆ ఆవులకు జియో ట్యాగ్ తీశారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. మత విద్వేషాలు రెచ్చగొడుతూ టీటీడీ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్న భూమనపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కాకర్ల డిమాండ్ చేశారు.

## కార్పొరేషన్ రాజకీయాలకి.. మరో అధికారి బలి

# కమిషనర్ 'సూర్య తేజ' ఆకస్మిక బదిలీ



నెల్లూరు నగర కార్పొరేషన్ రాజకీయాలకి మరో అధికారి బలయ్యాడు. షరామామూలే అన్నట్లుగా కార్పొరేషన్ కమిషనర్ మల్లవరపు సూర్యతేజ మరో చోటికి బదిలీ అయ్యాడు. గత ఏడాది జులై 24న నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా సూర్యతేజ బాధ్యతలు చేపట్టాడు. తాజాగా ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆయన్ను నియమిస్తూ, ప్రభుత్వం ఏప్రిల్ 16న ఉత్తర్వులిచ్చింది. నెల్లూరుకు వచ్చి 9 నెలలు కూడా గడవకముందే ఆయనపై బదిలీ వేటు పడడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. వచ్చీ రాగానే కార్పొరేషన్ తీరు చూసి దాన్ని ప్రక్షాళన చేయాలనుకోవడం, పనులు సరిగా చేయనివారికి తాఖీదులివ్వడంలో సంచలనం కలిగించారాయన. తెరవెనుక ఏమయ్యిందో తెలియదు, తన ఏకపక్ష నిర్ణయాల ఫలితమో లేక నాయకులతో విభేదాలేమైనా వచ్చాయో కానీ, మొత్తానికి ఆయన బదిలీపై వెళ్ళడం మాత్రం సర్వత్రా కలకలం సృష్టిస్తోంది.

### నెల్లూరా..మజాకా...?

వాస్తవానికి నెల్లూరు కార్పొరేషన్‌లో పనిచేయడమంటే ఆషామాషీ కాదు. ఇక్కడి నాయకులతో కలసి నెగ్గుకురావడం కత్తి మీద సాములాంటిదే. ఎంతటి శక్తియుక్తులున్న అధికారైనా నెల్లూరు కార్పొరేషన్‌కి రావడం మాత్రమే ఆయన చేతుల్లో ఉంటుంది. వెళ్లిపోవడం మాత్రం రాజకీయనేతల చేతుల్లో ఉంటుంది. నెల్లూరా మజాకానా..! అన్నట్లుంటుంది ఇక్కడి వ్యవహారం. కొంతమంది సొంత నిర్ణయాలు తీసుకుంటూ, స్వయంకృతాపరాధాలతో ఇక్కడి నుంచి పెట్టేబేడా సర్దుకుంటే, మరికొంతమంది ఆరోపణల మూటలు నెత్తినపెట్టుకుని వెళ్ళిన ఘటనలు చాలానే వున్నాయి. అందుకే, నెల్లూరు కార్పొరేషన్‌లో పనిచేయాలంటే ప్రతిభకన్నా లౌక్యం ఎక్కువ అవసరం అంటారు అనుభవజ్ఞులు. నిక్కచ్చిగా పనిచేస్తే ఇదేందబ్బా ఇంత కఠినంగా ఉన్నాడంటారు. మెత్తగా ఉంటే ఇదేందయ్యా ఇంత మెతకదనం అని తీసి పారేస్తారు. కాస్త చిత్తశుద్ధి డొక్కశుద్ధీ ఉన్న అధికారులు కూడా 'ఎందుకొచ్చిన తలనొప్పి' అని ఏదో ఒకవిధంగా ఇక్కడికి బదిలీపై రాకుండా తప్పించుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. ఒకవేళ విధిలేక ఎవరైనా చిత్తశుద్ధి కలిగిన అధికారి ఇక్కడికి వచ్చాడనుకోండి. ఆయన్ను సక్రమంగా పనిచేయనివ్వరు. మంచి పనిచేద్దామని ప్రయత్నించినా పడనివ్వరు. ఏదో ఒక నిందారోపణలు వేసి పంపించేస్తుంటారన్నది జగమెరిగిన సత్యం. గతంలో అనేకమంది ఇలానే వెళ్లిపోయిన అనుభవాలు నగర కార్పొరేషన్‌కి చాలానే వున్నాయి.

### బదిలీలు షరా మామూలే!..

స్థానిక నాయకులే కాదు, కార్పొరేషన్‌లో పనిచేసే సిబ్బంది కూడా సామాన్యులు కాదు. తమ ఉన్నతాధికారి తమ జేబుల్లో ఉండాలనుకుంటారు. తాము చెప్పిన దానికల్లా తలాడించాలని ఆశిస్తారు. తమ బాసులు పలానా పనిచేయండని పదేపదే ఆదేశాలిచ్చినా. ఆ పనులు జరగవు కాక జరగవు. సామాన్యులెవరైనా కార్పొరేషన్‌కి వెళ్ళి ఏద్కెనా పనిచేసుకురావాలంటే చుక్కలు కనిపిస్తాయి. పైఅధికారులు హుంకరించినా సరే, ఇక్కడ బెదిరేవారెవరూ ఉండరు. ఒక్క సూర్యతేజే కాదు, 'లౌక్యవాదం' తెలియని ఏ కమిషనర్ వచ్చినా ఇక్కడ మనుగడ సాధించలేదు. అందరూ పనులు చేస్తున్నట్లే నటిస్తుంటారు. కానీ ఒక్క పనీ జరగదు. కొయ్యగుర్రం పరుగులా ఉంటుంది ఇక్కడి తీరు. ఏ విభాగంలో చూసినా కమీషన్ల కక్కుర్తే తప్ప, సజావుగా పనులు సాగవు. ఇవన్నీ అందరికీ తెలిసినవే. ఇక ఎక్కడినుంచో వచ్చే ఉన్నతాధికారులు, వాస్తవ పరిస్థితుల లోతులు తెలుసుకునే లోపలే ఇక్కడ నుంచి మూటాముల్లె సర్దుకుని బదిలీ అయిపోతుంటారు. నెల్లూరు నగర కార్పొరేషన్ అంటేనే ఒకపెద్ద మాఫియాకి నిలయం. అటు రాజకీయ నాయకులూ ఇటు కార్పొరేషన్ సిబ్బంది ఇద్దరూ తోడు దొంగలే. అక్రమాలలో ఆరితేరిపోయి, నీకింత, నాకింత అని పంచుకుంటుంటారు. మధ్యలో సూర్యతేజ లాంటి అధికారులు బలైపోతుంటారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎంతటి ఘనులు అధికారంలోకి వచ్చినా నెల్లూరుకార్పొరేషన్‌ని మార్చడం మాత్రం దేవుడి తరం కూడా కాదు..!

## శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి సేవలో...

# ఆల్తూరు కుటుంబసభ్యులు

### ఆలయ అభివృద్ధికి ఆర్థిక చేయూత



నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో ప్రధాన ఆలయ గోపుర జీర్ణోద్ధరణ, ధ్వజస్తంభ పునర్నిర్మాణాలు తదితర కార్యాలకు సంబంధించి జరుగుతున్న పూజల్లో ఈనెల 16న ప్రముఖ దాతలు..ఆల్తూరు వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఆలయానికి విమానగోపుర జీర్ణోద్ధరణ, సాలాహార నిర్మాణం, నవగ్రహ మండపం నిర్మాణం, దేవస్థానానికి స్తంభవర్గాల ఏర్పాటు, దక్షణం వైపున ప్రహరీగోడ నిర్మాణాలకు ఆల్తూరు కుటుంబసభ్యులు సహాయ సహకారాలందిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా దాతలు ఆల్తూరు సులోచనమ్మ, ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి-లత దంపతులు, ఆల్తూరు మహేష్‌రెడ్డి-రాధిక దంపతులు (ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్, మరయు ఎస్ఎస్ కన్‌స్ట్రక్షన్స్) పాల్గొని అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు.




లాయర్
ఏప్రిల్ 18, 2025

# బాలల అక్రమరవాణాపై 'సుప్రీం' కొరడా

ఎంతోకాలంగా దేశాన్ని పట్టిపీడిస్తున్న బాలల అక్రమరవాణా వ్యవహారాలపై దేశ అత్యున్నత న్యాయస్థానం 'సుప్రీం కోర్టు' కొరడా ఝుళిపించింది. బాలలను అక్రమరవాణా చేస్తున్న నేరస్తుల పట్ల కఠినంగా ఉండాలంటూ తాజాగా ప్రభుత్వాలకు సూచించింది. బాలల అక్రమరవాణాకు పాల్పడుతున్న నేరస్తులు సమాజానికి ఒక పెద్దముప్పుగా తయారవుతున్నారని, ఈ కేసులు రోజురోజుకీ పెరిగిపోతూనే ఉన్నాయని, నిందితులు మాత్రం ఎప్పటికప్పుడు రకరకాల ఎత్తులు వేస్తూ చట్టం నుంచి తప్పించుకోవడానికి చూస్తున్నారని సుప్రీం కోర్టు ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఈ అక్రమరవాణాను నేరస్తులు కొనసాగిస్తున్నారని, ప్రభుత్వాలు-న్యాయస్థానాలు అలాంటి నేరాలు చేస్తున్నవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని కూడా సుప్రీం ధర్మాసనం స్పష్టం చేయడం విశేషం.

దేశంలో శిశువులు, చిన్నారుల అక్రమరవాణాకు సంబంధించిన కేసుల విషయంలో నిర్లక్ష్యం వద్దని, బాధితులకు ప్రభుత్వాలు అండగా ఉండకుండా నిందితులు బెయిల్‌పై తప్పించుకుపోతున్నా పట్టించుకోకపోవడం ఏమిటని ఈ సందర్భంగా సుప్రీం ప్రశ్నించింది. బాలల అక్రమరవాణా వ్యవహారాలకి సంబంధించి ఉత్తర ప్రదేశ్‌కి చెందిన ఓ కేసు దేశవ్యాప్తంగా తాజాగా ఈ సంచలనానికి కేంద్రబిందువైంది. అక్కడి ఓ ఆసుపత్రిలో నవజాత శిశువును ఎవరో గుర్తుతెలియని వ్యక్తి అపహరించుకుపోయి, బాధితులు పోలీసులను ఆశ్రయించేలోపే ఎవరికో అమ్మేశాడు. అయితే, ఈ కేసులో నిందితునికి అలహాబాద్ హైకోర్టు బెయిల్ ఇచ్చింది. దీంతో బాధితులైన తల్లితండ్రులు సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో, సుప్రీం కోర్టు ఆ బెయిల్‌ను రద్దుచేయడమే కాక, అలా బెయిల్ ఇవ్వడంపై హైకోర్టును తప్పుపట్టింది. అంతేకాదు, బాలల అక్రమరవాణా కేసుల విషయంలో అటు న్యాయస్థానాలు, ఇటు ప్రభుత్వాలు ఎలా వ్యవహరిస్తున్నాయో చెప్పాలంటూ, దేశంలోని అన్ని హైకోర్టులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో మొత్తంగా ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఆ కేసుల పట్ల ఎలా వ్యవహరించాలో సుప్రీం పలు మార్గదర్శకాలు కూడా చేసింది. బాలల అక్రమరవాణా కేసుల విషయంలో విచారణను 6నెలల్లోగా పూర్తి చేయాలని, అవసరమైతే రోజువారీ విచారణలు కూడా చేపట్టాలని ఆదేశాలిచ్చింది. విచారణ పూర్తవగానే సుప్రీంకు నివేదించాలని కూడా స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా అన్ని హైకోర్టులు, జిల్లా కోర్టులు పెండింగ్‌లో ఉన్న పిల్లల కిడ్నాప్ కేసులు, చిన్నారుల అక్రమరవాణా కేసులపై వెంటనే దృష్టిసారించి ట్రయల్ కోర్టుల్లోని ఆ కేసుల వివరాలు తెప్పించుకోవాలని సర్క్యులర్ జారీచేసింది. అంతేకాదు, ఏ ఆసుపత్రిలోనైనా సరే, శిశువులు లేదా చిన్నారుల అక్రమ రవాణా జరిగినట్లు తేలితే ఆ ఆసుపత్రి లైసెన్స్‌ను వెంటనే రద్దు చేయాలని ఆదేశించింది. అదేవిధంగా, ఉత్తరప్రదేశ్‌లో శిశువుల కిడ్నాప్ రాకెట్‌లో సూత్రధారులైన 13 మంది నిందితులకు అక్కడి హైకోర్టు గతంలో ఇచ్చిన బెయిల్‌ను కూడా సుప్రీం ధర్మాసనం రద్దుచేసింది. మొత్తమ్మీద బాలల అక్రమరవాణా కేసుల విషయంలో జరుగుతున్న నిర్లక్ష్యం పట్ల సుప్రీం ఆగ్రహిస్తూ, కేసుల పురోగతికి తగు మార్గదర్శకాలు చేయడం, ఈ సందర్భంగా సుప్రీం వ్యాఖ్యలు ప్రభుత్వాల కళ్ళు తెరిపించేలా ఉండడం గమనార్హం. ఆసుపత్రుల్లో నవజాత శిశువులు, ఇతర బహిరంగ ప్రాంతాల్లో చిన్నారుల కిడ్నాప్ ఘటనల నివారణలో రాష్ట్రాలు అవలంభిస్తున్న విధానాల్లో తీవ్రమైన లోపాలు ఉన్నట్లు భారతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బర్డ్) సంస్థ గుర్తించిందని, ఆ నివేదికను రాష్ట్రాలన్నీ కూలంకుషంగా పరిశీలించాలని, అందులోని ప్రతి సిఫార్సును రాష్ట్రాలు తప్పకుండా పాటించాలని కూడా సుప్రీం స్పష్టం చేసింది. కిడ్నాపర్ల చెర నుంచి విముక్తిపొందిన చిన్నారులను పాఠశాలల్లో చేర్పించాలని తెలిపింది.

బాలల అక్రమ రవాణాకు పాల్పడే కిడ్నాపర్లు చట్టం నుంచి ఏదోఒకవిధంగా తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, అలాంటి వారిపట్ల నిర్లక్ష్యంగా ఉండడంతో మరెందరో నిందితులు తయారవుతున్నారని ధర్మాసనం చేసిన కీలకమైన వ్యాఖ్యలు ఎంతో ముఖ్యమైనవి. అదే సందర్భంలో, తమ పిల్లలు కిడ్నాప్‌లకి గురికాకుండా తల్లితండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలని సుప్రీంకోర్టు సూచించింది. ఏదేమైనా, సుప్రీం చెప్పిన మార్గదర్శకాలను చిత్తశుద్ధితో అనుసరిస్తే.. దేశంలో దారుణమైన.. అమానవీయమైన ఈ అక్రమరవాణాల నిరోధానికి మార్గం సుగమమైనట్లేనని భావించవచ్చు. సుప్రీం సూచనలతో ఎట్టకేలకు ఈ కేసుల సత్వర విచారణలలో త్వరలో మంచి పురోగతిని కూడా ఆశించవచ్చు.

## సవాళ్ళు ప్రతిసవాళ్ళ చుట్టూ రాష్ట్ర రాజకీయాలు!

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు సవాళ్ళు, ప్రతిసవాళ్ళ చుట్టూ తిరుగుతున్నాయి. బాధ్యతాయుతమైన రాజకీయపార్టీలు వాటి నాయకులూ రాజకీయాల అర్ధం మార్చేస్తున్నారు. రాజకీయం అంటే అరాచకీయం అనే భావన కలిగేలా భవిష్యత్ తరాల వారికి సంకేతాలు ఇస్తున్నారు. ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి వంటి అంశాలని అన్ని పార్టీల నాయకులు గాలికొదిలేశారు. నువ్వెంతంటే నువ్వెంతనే పరస్పర విమర్శలతో, దూషణలతో పబ్బం గడిపేస్తున్నారు. పోలీసులు, కేసులు, కోర్టులు అంటూ కాలక్షేపం చేస్తున్నారు. రాజకీయాలంటేనే జుగుప్స కలిగేలా ప్రవర్తిస్తున్నారు. పాతతరం రాజకీయ నేతలు సిగ్గుతో తలదించుకునేలా వ్యవహరిస్తున్నారు. ఇది మంచి పరిణామం కాదు. భావితరాలకు శ్రేయస్కరం కాదు. పొట్టి శ్రీరాములు, నీలం సంజీవరెడ్డి, టంగుటూరు ప్రకాశం పంతులు, పి.వి. నరసింహారావు, డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్యలతో పాటు ఇంకా ఎంతోమంది గొప్ప నాయకులని చూసిన రాష్ట్రం మనది. అలాంటి చరిత్ర కలిగిన రాష్ట్రంలో చరిత్రహీనులుగా మిగిలిపోయేలా నేటితరం నాయకులు ప్రవర్తించడం బాధాకరం..!

– *లక్ష్మీ భరద్వాజ్,* **హైదరాబాదు.**

## పైళ్లు సరే.. మరి కేసులో!

భారతదేశ అత్యున్నత న్యాయస్థానం తాజాగా ఒక కొత్త నిర్ణయాన్ని ప్రకటించింది. రాష్ట్ర గవర్నర్‌ల నుండి సాక్షాత్తూ భారత రాష్ట్రపతి వరకూ రాజ్యాంగ పదవులలో వున్నవారు ఎవరైనాసరే ప్రభుత్వ పెద్దల నుండి తమ వద్దకి వచ్చే ఫైళ్లపై 3నెలలలోగా నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఇది స్వాగతించదగిన నిర్ణయం. ఇదే తరహాలో దీర్ఘకాలంగా న్యాయస్థానాల్లో నలుగుతున్న కేసులకి కూడా గడువు విధిస్తే బాగుంటుంది. ఆర్థిక నేరాలు చేసిన ఘనులు కేసులు ఎదుర్కొంటూ ఏళ్ళ తరబడి బెయిళ్లపై బాహ్య ప్రపంచంలో దర్జాగా తిరిగేస్తున్నారు. దొంగలు ప్రభుత్వాధినేతలై రాజ్యాలు ఏలుతున్నారు. వీటన్నిటికీ కారణం న్యాయస్థానాలలో కేసులు ఏళ్ళతరబడి నడవడమే. వాయిదాలపై వాయిదాలతో తుది తీర్పులు ఆలస్యం కావడమే. ఈ విషయాలపై కూడా గౌరవ న్యాయస్థానాలు, వాటి పెద్దలు ఒక నిర్ణయం తీసుకుని కేసుల స్థాయిని బట్టి గడువు విధిస్తే బాగుంటుందేమో!

– *యం. చంద్రమౌళి,* **కొత్తఢిల్లీ.**

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## పార్కులు పగలు కూడా తెరిచే ఉంచండి!

నెల్లూరు తక్కువ కాలుష్య నగరంగా జాతీయస్థాయిలో గుర్తించబడడం సంతోషం. అలాగే నగరానికి పలు పనులపై జనాభా అధిక సంఖ్యలో వస్తుంటారు. ఇలాంటి వారికోసం, ఎండలలో చల్లగా సేదదీరేలా పార్కులు పగటి వేళలలో తెరచే ఉంచితే బాగుంటుంది. దీంతోపాటు మరిన్ని మరుగుదొడ్లు నిర్మించడం, తాగునీటి సదుపాయాన్ని కల్పించడం వంటివి చేయాలి. పార్కులతో పాటు బారా షహీద్ దర్గా దగ్గర, నెక్లెసు రోడ్డులో సైతం వినోదాన్ని పంచడానికి ఎఫ్.ఎం మరియు దూరదర్శన్ లాంటి వినోద సాధనాలు ఏర్పాటు చేయాలి. పార్కులను కేవలం సాయంత్రం వేళలకి పరిమితం చేయకుండా, తగినంత సిబ్బందిని నియమించి, పగటిపూట కూడా కాసింత చల్లగా ఎండకి నీడనిచ్చేలా చేసి ఆక్సిజన్ సెంటర్లుగా వాటిని తీర్చిదిద్దితే బాగుంటుంది!

*ఐనకోట రవికుమార్,* **నెల్లూరు.**




### ఇప్పటికే నెత్తిన ధరల 'బండ'..

# గ్యాస్ పెంపుతో మరో గుదిబండ!

ఏదైనా కష్టమొస్తే రాముడికి చెప్పుకుంటాం. కానీ ఆ రాముడే కష్టపెడితే ఎవరికి చెప్పుకోవాలి?.. అన్నట్లుగా ఉంది మన దేశంలో ప్రజల పరిస్థితి. నిరుపేదలు, బడుగుజీవులకు బతకు బండి లాగడమే పెద్ద సవాల్‌గా తయారైన నేటి రోజుల్లో, తలపై పడుతున్న ధరల బండ వారిని మరింత అయోమయానికి గురిచేస్తోంది. తాజాగా వంటగ్యాస్ ధరను కేంద్రం అమాంతంగా పెంచేసింది. పెద్ద చిన్న అన్న తేడా లేకుండా పేదోళ్ళ నుండి గొప్పోళ్ళ దాకా దేశంలో కొన్ని కోట్ల మంది గ్యాస్‌ను వినియోగిస్తారు. దాదాపుగా దేశంలోని ప్రతీ కుటుంబంలోనూ గ్యాస్ ఓ భాగం.

గతంలో చాలా సందర్భాలలో గ్యాస్ ధర పెరిగినప్పుడు ఏ అయిదో, పదో పెరుగుతుండేది. ఇప్పుడు ఏకంగా 50 రూపాయలు పెరగడంతో ప్రజలు కంగు తిన్నారు. దీంతో, ఇప్పటికే 803 రూపాయల వరకు ఉన్న గ్యాస్ ధర 853 రూపాయలకు చేరింది. మళ్ళీ డోర్‌డెలివరీకి మరో 50 అధికంగా అవుతుంది. ఉజ్వల పథకం పేరుతో ఇచ్చే గ్యాస్ బండ కూడా 503 నుంచి 553 రూపాయల్కెంది.

పెట్రోలు, డీజల్ ధరలు కూడా వినియోగదార్లకు చుక్కలు చూపిస్తున్నాయి. ఇలా పెరుగుతున్న ధరాభారాలను మోయాలంటే సామాన్యజనానికి ఎంత కష్టమో పాలకులు ఆలోచించడం లేదు. వ్యాపార రంగంలో వస్తున్న సంక్షోభాలకి ధరలు పెంచక తప్పడంలేదని చెప్పి కేంద్రం తనని తాను సమర్ధించుకుంటోంది. కారణమేదైనా దాదాపు దేశంలో ప్రతి ఇంటికీ అవసరమైన గ్యాస్ ధర కూడా మండిపోతుండడం పట్ల ప్రజల్లో, ముఖ్యంగా గృహిణుల్లో తీవ్ర ఆందోళన, ఆవేదన వ్యక్తమవుతున్నాయి.

**నిత్యావసర సరుకుల ధరలు చుక్కల లోకంలో :**

గ్యాస్ ధర ఆకాశంలో ఉంటే, మిగిలిన నిత్యావసర వస్తువుల ధరలు చుక్కల లోకంలో విహరిస్తున్నాయి. కేజీ బియ్యం 60 రూపాయల దాకా పలుకుతుంటే, కిలో కందిపప్పు మార్కెట్లో 130 నుంచి 150 రూపాయల దాకా వుంది. అనేక కూరల్లో మనవాళ్ళు కందిపప్పునే బాగా వాడుతుంటారు.

కానీ, దాని ధర కూడా భారీగా పెరగడంతో అవసరమైన మేరకే కొద్ది మోతాదులో తెచ్చుకుని వండుకుంటున్నారు. రేషన్ దుకాణంలో గతంలో కందిపప్పు తక్కువ ధరకి ఇచ్చేవారు. ఉడికీ ఉడకని ఆ నాసిరకం పప్పు కూడా కిలో 67రూపాయలకి లభించేది. గత మూడు మాసాలుగా అది కూడా సక్రమంగా రావడంలేదు. వంటావార్పులకి అవసరమైన పెసరపప్పు, మినప్పప్పు ధరలు చూస్తే కిలో 130 నుంచి 140 రూపాయల దాకా పలుకుతున్నాయి. అసలే, మార్కెట్లో దొరికే సరకు నాణ్యత అంతంత మాత్రం. అవి కూడా బోలెడు ధర పెట్టి కొనాలంటే ఎంత బాధో అనుభవించే వారికే తెలుస్తుంది. ఇక వంటనూనెల ధరలైతే లీటరు 135 నుంచి 150 రూపాయలు పెట్టాల్సిందే. గతంలో ఇవన్నీ ఏ 50–60కో వస్తుండేవి. ఇప్పుడా రోజులు పోయాయి. ఏదైనా వంద దాటాల్సిందే.

కూరగాయల ధరలు అమాంతం పెరిగాయి. మిగతావన్నీ పెరిగాయిగా మేమేం తక్కువ తిన్నాం అన్నట్లుగా, అవి కూడా సామాన్యుడి వెక్కిరిస్తున్నాయి. ఇలా ఇష్టానుసారం పెరిగిపోతున్న ధరలను అదుపుచేసే పటిష్టమైన వ్యవస్థలు మనదేశంలో లేకపోవడమే మనకి పెద్ద లోపం, శాపం కూడా. ఒకవేళ ఉన్నా మమ్మల్ని అవి నిరోధించగలవా అన్నట్లుగా నిత్యావసరాలన్నీ వ్యంగ్యంగా వినియోగదారుడి వైపు చూస్తుంటాయి.

**ధరల నియంత్రణ ఉత్తుత్తి మాటే! :**

దేశంలో సంపద బాగా పెరిగిపోతోందని, ఆర్థికంగా మనదేశం కూడా ఎదిగిపోతోందని, ప్రపంచంలో మూడోస్థానంలోకి చేరిపోతోందంటూ బీరాలు పోతున్న మన నాయకుల ఉపన్యాసాల్లో నిజం లేకపోలేదు. కొంతమేరకు దేశం పరిస్థితి ఆర్థికంగా మునుపటికన్నా బాగానే ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే, అట్టడుగున ఉన్న బడుగు బలహీన వర్గాల ప్రజలు మాత్రం ఇంకా అధోగతిలోనే ఉన్నారన్నది ఎవరూ కాదనలేని సత్యం. పెరుగుతున్న ధరలతో పోటీ పడి కొనగలిగే సామర్థ్యం అందరికీ లేదన్నది ఎవ్వరూ కాదనలేని నిజం. నిరుద్యోగం, అసమానతలు కూడా ధరలతో పాటు అమాంతం పెరిగిపోతున్నాయే తప్ప, ఏనాడూ తగ్గిందిలేదు. దీంతో దేశంలో అత్యధికశాతం ప్రజల జీవనస్థితులు అల్లకల్లోలంగా ఉంటున్నాయి. 15 ఏళ్ళ క్రితం ధరలకీ, ఇప్పటికీ ధరలకీ పోల్చిచూసుకుంటే, ధరలు ఏస్థాయిలో పెరిగాయో అర్థమవుతుంది. కాలం పెరిగేకొద్దీ అధునాతన వసతులు వచ్చి, జీవనప్రమాణాలు మెరుగుపడాల్సింది పోయి, అత్యధికశాతం ప్రజలు నానాటికీ బతకడమే కష్టంగా జీవిస్తుండడం ఏమిటన్న విషయంపై మేధావులు పరిశీలనలు జరపాలి.

పట్టణాలు, గ్రామాల్లో కూడా కొనుగోలు శక్తి బాగా తగ్గిపోయింది. రోజువారీ వేతనాలు, నెలసరి జీతాలతో అత్తెసరు బతుకులు బతికేవారు, ధరలు ఎంత స్వల్పంగా పెరిగినా తట్టుకోలేక బాధలు పడాల్సి వస్తుంది. మార్కెట్లో ఏమీ కొనలేక, తినలేక ఆకాశాన్ని చూసుకుంటూ, మౌనాన్నే మేసుకుంటూ వెళ్ళిపోయే నిరాశాజీవుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటోందో మేధావులు అధ్యయనం చేయాలి. క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలిస్తే, ఇలాంటి కఠోర నిజాలెన్నో వెలుగులోకి వస్తాయి.

ఇప్పుడున్న ఆర్థిక విధానాలతో సంపన్నులు మరింత కుబేరులుగా, పేదలు ఇంకా బీదలుగా తయారవుతున్నారన్నది నిష్టుర సత్యం. అభివృద్ధి చెందుతున్న దేశంలో, అభివృద్ధికి నోచుకోనివారిని కూడా ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకోవాలి. వారిని కూడా అభివృద్ధిపథంలో నడిపించాలి. అలా సమన్వయం చేసినప్పుడే దేశానికి పూర్తిస్థాయి సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుంది. లేకుంటే అసమగ్ర అభివృద్ధే అవుతుంది.

ఇప్పటికే ధరల బండతో బరువెక్కిన బడుగుల బ్రతుకులపైన గ్యాస్ ధర పెంపు రూపంలో మరో 'గుదిబండని' వేసింది కేంద్ర ప్రభుత్వం. 'తగ్గేదే లే!'.. అన్నట్లుగా పెంచుతున్న ధరలతో సామాన్య బ్రతుకులని భారం చేసింది..!

**- రాజశ్రీ**


పుట్టినరోజు శుభాకాంక్షలు
మా పెద్దాయన, నా శ్రేయోభిలాషి, నాకు దైవ సమానులు
మనసున్న మారాజు, సేవాతత్పరులు
నెల్లూరు పార్లమెంటు సభ్యులు
శ్రీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి గారికి
పుట్టినరోజు (ఏప్రిల్ 19) శుభాకాంక్షలు.
ప్రత్తి శ్రీనివాసులు
(లేట్ ప్రత్తి సూరి కుమారుడు)
రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియం
శ్రీరాజ్ హైరర్స్
శ్రీ కస్తూరిదేవి విద్యాలయ ప్రాంగణం, నెల్లూరు.
PSR గెస్ట్ హౌసెస్
సెల్ : 9347102503,
మేనేజర్ : 79816 46731
కీ॥శే॥ ప్రత్తి సూరి
PSR Guest House
Bajaj Electronics Back Side
PSR Guest House
Saraswathi Nagar
PSR WHITE HOUSE Guest
JK Reddy House Back Side
PSR SURI GRAND
Magunta Lay out
PSR Gokulam Guest House
RameshReddy Nagar
PSR Guest Inn Guest House
SS Family Daba Road
PSR Keerthi Vills
VPR Convention Hall Back Side
PSR Hirivillu Guest House
Saraswathi Nagar
రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియం

## నెల్లూరు కబుర్లు

# హోరెత్తిన.. శోభాయాత్ర

● మార్మోగిన జై శ్రీరామ్! జై హనుమాన్!



నెల్లూరు నగరంలో ఈనెల 13న పెద్దఎత్తున హనుమాన్ భక్త శోభాయాత్ర జరిగింది. భక్తులు వేలసంఖ్యలో పాల్గొన్నారు. జై శ్రీ రామ్, జై భజరంగ భళీ.. అంటూ నినాదాలు చేస్తూ నగరాన్ని హోరెత్తించారు. కాషాయ జెండాలు, హనుమాన్, శ్రీరామ్ జెండాలతో యాత్ర కన్నులపండువగా సాగింది. ఏసీ స్టేడియం వద్ద నుంచి ప్రారంభమైన ఈ యాత్ర కెవిఆర్ పెట్రోల్‌బంకు, గాంధీబొమ్మ కూడలి, కనకమహల్ సెంటర్, స్టోన్‌హౌస్ పేటల మీదుగా ఆర్‌ఎస్‌ఆర్ పాఠశాలకు చేరుకుంది. పెద్దసంఖ్యలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. హనుమ విజయోత్సవాన్ని పురస్కరించుకుని, హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో భారీగా జరిగిన ఈ కార్యక్రమంలో బైక్‌ర్యాలీతో పాటు, వందలాదిమంది భక్తులు పాదయాత్ర చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. హనుమంతుని ధీరత్వం, కార్యదక్షత వంటి సుగుణాలను యువతలో పెంపొందించేందుకు ప్రతి ఏడాది ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హిందూ చైతన్య వేదిక రాష్ట్ర సహాధ్యక్షుడు కోడూరు జయరామ్, రాష్ట్ర నాయకులు నేలపాటి నాగశ్రీనివాస్, పీజీ మహేష్, రాష్ట్ర ప్రచారవిభాగం అధ్యక్షుడు కాకు మురళీరెడ్డి, జిల్లా నాయకులు టి.సాయిశ్రీనివాస్, ఏ.రామాంజనేయులు, ఎస్ వెంకటేశ్వర్లు, మోహన్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో శోభాయాత్ర శోభాయమానంగా జరిగింది.

## తలసీమియా సెంటర్‌కు..

# 'మైథిలి స్కూల్'విరాళం

### మనోహర్‌రెడ్డి జ్ఞాపకార్థం రెండున్నర లక్షల వితరణ



సమాజసేవాపరాయణుడైన దివంగత విద్యావేత్త బి.మనోహర్‌రెడ్డి (మైథిలి మనోహర్‌రెడ్డి) జ్ఞాపకార్థం నెల్లూరులోని మైథిలి స్కూల్ యాజమాన్యం తరపున ఆయన సతీమణి బి.మైథిలి, వారి కుమార్తె బి.శశిప్రియలు ఇటీవల రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తలసీమియా నివారణ కేంద్రానికి రెండున్నర లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. రెడ్‌క్రాస్ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, తలసీమియాసెంటర్ కన్వీనర్ డాక్టర్ ఎస్.సీత, డాక్టర్ రమ్యలకు ఆ విరాళాన్ని అందించారు. మైథిలి స్కూల్ విద్యార్థులు వారి పాకెట్ మనీ నుండి ఇచ్చిన మొత్తంతో కలిపి ఈ విరాళం ఇవ్వడం విశేషం. నెల్లూరు రెడ్ క్రాస్ సొసైటీకి మనోహర్‌రెడ్డి చేసిన సేవలు అపూర్వమని రెడ్‌క్రాస్ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి కొనియాడారు. వాకర్స్ 203 డిస్ట్రిక్ట్ ఎలెక్ట్ గవర్నర్-2025 నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.



## ఇంటర్ ఫలితాల్లో..

# సత్తాచాటిన 'విశ్వసాయి' విద్యార్థులు

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 12న ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో నెల్లూరులోని విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు తమ సత్తా చాటుతూ ఉత్తమ ఉత్తీర్ణతలు సాధించారు. జూనియర్ ఇంటర్‌లో 470 మార్కులకు గాను కె.హేమంత్ రాఘవ 466 మార్కులు సాధించాడు. అదేవిధంగా 465 మార్కులతో ఏ. విజిత, సి.శివమోక్షజ్ఞ, ఏ హర్షసాయి, పి.లిఖిత, 464 మార్కులతో సి.శరణ్య, జి.జనార్దన్, ఎన్.నిషిత, ఎన్.ప్రదీప్, కె.వెంకటప్రణయ్‌లు ఉత్తమ ఫలితాలు సాధించి అందరి ప్రశంసలు అందుకున్నారు. 460 మార్కులకు పైగా 50 మంది, 429 మార్కులపైగా 523 మంది అత్యుత్తమ ఫలితాలు సాధించడం విశేషం. బైపీసీలో 440 మార్కులకు షేక్‌సాధికా 436, వై.వెంకటగ్రీష్మ, ఎన్.ధనుష్, ఎస్. వెంకటసునీహ, ఎస్. సాయిమహిక, షేక్ షైమాలు 435 మార్కులు సాధించారు. బైపీసీలో 435కు పైగా మార్కులను 45 మంది, 400కుపైగా మార్కులను మరో 170 మంది విద్యార్థులు సాధించి కళాశాలకు మంచిపేరు తెచ్చారు.

**సీనియర్ ఇంటర్‌లో..**

సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీలో వెయ్యి మార్కులకు గాను పి. ప్రీతిక, ఎన్ గ్రీష్మారెడ్డి 988 మార్కులతో అగ్రగాములుగా నిలిచారు. జి.లిఖిత 987, పి.ఆస్రిత, కె.వెంకటరామిరెడ్డి, జి.చక్రధర్, వి.శిరీష, యు.కుశ్వంత్‌కుమార్ 986 మార్కుల వంతున సాధించారు. 980పైగా 38మంది విద్యార్థులు, 950పైగా 198 మంది, 900 మార్కులకుపైగా 382 మంది సాధించి తమ ప్రతిభను నిరూపించుకున్నారు. బైపీసీలో వెయ్యి మార్కులకు టి.ప్రియాంక 987 మార్కులు సాధించి తన ప్రతిభాపాటవాలను చాటుకుంది. అదేవిధంగా, 986 మార్కులతో కె.ఆయేషా, 985 మార్కులతో ఓ.శ్రావ్యారెడ్డి, షేక్ సమీర్, షేక్ రిజ్వాన్, ఏ.సంజన గ్రేస్, పి.ఫర్జానలు ఉత్తమ ఫలితాలు సాధించారు. 980 మార్కులకుపైగా మరో 20 మంది, 950పైగా 143 మంది, 900 మార్కులకు పైగా 149మంది మంచి ఫలితాలతో రాణించారు. ఈ సందర్భంగా విద్యార్థినీవిద్యార్థులను కళాశాల ఛైర్మెన్ డా. ఎన్.సత్యనారాయణ, వైస్‌ఛైర్మెన్ జి.కృష్ణమోహన్, ఛైర్‌పర్సన్ రుక్మిణిలతో పాటు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతరులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# ఎస్‌విఆర్ స్కూల్‌లో తల్లితండ్రుల సమావేశం




నెల్లూరులోని ఎస్‌విఆర్ స్కూల్‌లో ఇటీవల తల్లిదండ్రుల సమావేశం జరిగింది. విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి ఎన్.నరసయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని, తల్లితండ్రులు పిల్లల పట్ల ప్రేమగా, స్నేహపూర్వకంగా మెలగాలని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లలకు ఇచ్చే నిజమైన ఆస్తి చదువేనని, అటువంటి విద్యను తక్కువ ఫీజుతో అందిస్తున్న ఎస్‌విఆర్ స్కూలు యాజమాన్యం అభినందనీయమైనదని ఆయన కొనియాడారు. ఇలాంటి విద్యాలయం దొరకడం విద్యార్థులకు అదృష్టమన్నారు. స్కూలు కరెస్పాండెంట్ అందె శ్రీనివాసులు మాట్లాడుతూ, వేసవి సెలవుల్లో పిల్లలను మొబైల్ ఫోన్లకి దూరంగా ఉంచి, వారి అభిరుచిని గమనించి, పిల్లలు ఆట, పాటల్లో చురుగ్గా ఉండేలా ప్రోత్సహించాలని కోరారు.

అనంతరం గత సంవత్సరం స్కూలులో 10వతరగతి చదివి, ఈ సంవత్సరం ఇంటర్‌లో అత్యధిక మార్కులు సంపాదించిన విద్యార్థులను వారు అభినందించారు. స్కూలు ప్రిన్సిపాల్ బి.రమేష్‌బాబు, రచయిత మురళీ మోహన్‌రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో..

# ధ్వజస్తంభ పునర్నిర్మాణానికి పూజలు



నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో విమానధ్వజ జీర్ణోద్ధరణకు సంబంధించి ధ్వజస్తంభ పునర్నిర్మాణం, సాలాహార నిర్మాణం, నవగ్రహ మండపం పునర్నిర్మాణం, దేవస్థానానికి స్తంభవర్గాలు ఏర్పాటవుతున్నాయి. శ్రీ కంచికామకోటి పీఠాధిపతుల ఆదేశానుసారం వారి ఆస్థాన సిద్ధాంతి లక్కావఝుల విజయసుబ్రహ్మణ్యం దేవస్థానం అర్చకులతో కలసి ఈనెల15న పూజలు చేశారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, వేదస్వస్తి, గోపూజలతో ఆ పనులకు అంకురార్పణ జరిగింది. ఈ పూజా కార్యక్రమాలకి ప్రముఖ దాత.. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఆల్తూరు కుటుంబ సభ్యులు ఆల్తూరు సులోచనమ్మ ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి-లత, ఆల్తూరు మహేష్‌రెడ్డి-రాధిక దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డి పర్యవేక్షించారు.

# డా.అంబేద్కర్‌కు.. కాంగ్రెస్ నాయకుల నివాళి



భారత రాజ్యాంగ నిర్మాత, బహుముఖ ప్రజ్ఞశాలి స్వాతంత్ర్య సమర యోధులు డా. బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా నెల్లూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక విఆర్‌సి కూడలి వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల, దళిత బహుజన వర్గాల ఆశాజ్యోతి డా. అంబేద్కర్ అని కొనియాడారు. భారత రాజ్యాంగ నిర్మాత స్వతంత్ర భారతదేశ మొట్టమొదటి న్యాయశాఖ మంత్రి బాబాసాహెబ్ అంబేద్కర్ సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన రచించిన రాజ్యాంగమే నేడు దేశానికి శ్రీరామరక్ష అని అన్నారు. డీసీసీ ఉపాధ్యక్షులు తలారి బాలసుధాకర్, కోవూరు-నెల్లూరు కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జిలు ఏటూరి శ్రీనివాసులురెడ్డి, షేక్ ఫయాజ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పప్పర్తి గణేష్‌బాబు, సోషల్ మీడియా ఇన్‌చార్జి హుస్సేన్, రూరల్ అధ్యక్షులు హుస్సేన్ బాషా, నగర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నాగిరెడ్డి రాజేష్‌రెడ్డి, నసీమా, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# యువతకు స్ఫూర్తిదాయకం!..



భారతరత్న, నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు నెల్లూరు నగరంలోని విఆర్ కళాశాల కూడలిలో డా. అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా జరిగాయి. స్థానిక కెవిఆర్ నగరపాలక ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎన్‌సిసి సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పెద్దసంఖ్యలో ఎన్‌సిసి కేడెట్లు పాల్గొన్నారు. తొలుత, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం నరేంద్రబాబు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఒక సామాన్య నిరుపేద కుటుంబంలో పుట్టి అనేకరకాల వివక్షలు ఎదుర్కొని, వాటన్నిటిని అధిగమించి, ఉన్నత విద్యలను అభ్యసించి సామాన్య స్థాయి నుంచి అసామాన్య స్థాయికి ఎదిగారని, దేశానికి నిరుపమానమైన సేవలందించారని, ఆ మహనీయుని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని చెప్పారు.



# పేదలకు అండగా కూటమి ప్రభుత్వం!

## • మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



తమ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిరుపేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, తమది పేదలకు చేయూతనందించే ప్రభుత్వమని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని 47మంది లబ్ధిదారులకి రూ. 47.84 లక్షల విలువచేసే ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో కోట్లాది రూపాయలను సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా అందిస్తూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బాధిత కుటుంబాలను ఆదుకుంటున్నారన్నారు. ఒక్క ఆత్మకూరు నియోజకవర్గంలోనే తమ ప్రభుత్వం ఈ 10 నెలల కాలంలో 183 కుటుంబాలకు రూ. 2.22 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

### లక్ష సోలార్ యూనిట్లు..

'పీఎం సూర్యఘర్' పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఆనం కోరారు. పేదలకు ఉచితంగా లాభదాయకమైన విద్యుత్ అందించాలనే లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పిఎం సూర్యఘర్ పథకానికి శ్రీకారం చుట్టాయన్నారు. ఉమ్మడి నెల్లూరుజిల్లాలో నియోజకవర్గానికి 10వేలు వంతున 10 నియోజకవర్గాలకు లక్ష సోలార్ యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, ప్రతి ఒక్క పేద కుటుంబం ఈ సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసుకుని విద్యుత్ ఆదా చేయడంతో పాటు ప్రతినెలా కొంత ఆదాయం పొందే అవకాశాన్ని కూడా ప్రభుత్వం కల్పించిందన్నారు. రెండు కిలోవాట్ల సోలార్ యూనిట్ రూ. 1.20 లక్షలు ఖర్చు అవుతుండగా ఎస్సీ ఎస్టీలకు దానిని పూర్తి ఉచితంగా ఇస్తారని, బీసీలకు, ఇతరులకు కొంత సబ్సిడీతో మరియు సున్నా వడ్డీ రుణాలు ఇప్పించి సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. సోలార్ విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకుంటే, ఆ కంపెనీ నిర్వాహకులే వచ్చి సోలార్ యూనిట్లను బిగించి మీటర్లకు కనెక్షన్లు ఇస్తారని చెప్పారు. ప్రతినెలా ఆ కుటుంబం వాడుకున్న కరెంటు పోగా, మిగిలిన కరెంటును గ్రిడ్‌కు అనుసంధానం చేసి ప్రభుత్వం తీసుకుంటుందని, ఈ అదనపు విద్యుత్‌కు ఒక్కోయూనిట్‌కు సుమారు రూ.2.50 పైసలు చొప్పున లెక్కించి ప్రతినెలా వారి ఖాతాకు ప్రభుత్వం జమ చేస్తుందని చెప్పారు. ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకునేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

### నెలాఖరులో ఆత్మకూరులో మెగా జాబ్‌మేళా...

ఆత్మకూరులో ఈ నెలాఖరులో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తామని మంత్రి ఆనం తెలిపారు. ఆ కార్యక్రమంలో సుమారు 30 కంపెనీలు పాల్గొంటున్నాయని, విద్యావంతులైన నిరుద్యోగ యువత ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. త్వరలోనే జాబ్‌మేళా తేదీని ప్రకటిస్తామని, ఆత్మకూరు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత అందరూ తమ ధ్రువీకరణ పత్రాలతో జాబ్ మేళాకు హాజరై ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

# 'గాంధీనగర్' రోడ్డుకు.. మహర్దశ

## రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



నెల్లూరు రూరల్‌లో గాంధీనగర్ రోడ్డుకు మహర్దశ వస్తుందని, 2.70కోట్ల రూపాయలతో ఆ రోడ్డుకు డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులకు త్వరలోనే శంకుస్థాపన చేయబోతున్నామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఈనెల 13న ఆయన స్థానిక నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి విగ్రహం కూడలి వద్ద నుంచి డైకెస్‌రోడ్డు వరకు ఉన్న రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో తాను తలపెట్టిన రోడ్లన్నిటినీ వేగవంతంగా పూర్తిచేసి, రూరల్‌ని రాష్ట్రంలోనే అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతామన్నారు.






# లక్ష్య సాధనే ధ్యేయం కావాలి

భారత రాజ్యాంగ రచయిత, భారత రత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో విద్యార్థులందరూ రాణించాలని, లక్ష్య సాధనే ధ్యేయంగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. సోమవారం నెల్లూరు నగరంలోని మద్రాస్ బస్టాండ్ సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహ సముదాయంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, పలు సంఘాల నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. హాస్టల్ విద్యార్థులనుద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులందరూ బాగా చదువుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ, అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వలనే దేశంలో అణగారిన వర్గాలు ఉన్నతస్థాయికి చేరాయని చెప్పారు. సమాజంలో అసమానతలు, అంటరానితనం రూపుమాపేందుకు ఆయన తన జీవితాన్ని త్యాగం చేశారని గుర్తు చేశారు. విశ్రాంత ప్రొఫెసర్ కుసుమకుమారి, విశ్రాంత ఏఎస్ డబ్ల్యుఓ ఖాసీం, సాంఘిక సంక్షేమశాఖ డెప్యూటీ డైరెక్టర్ శోభారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.




తిరుపతి జిల్లా

# గూడూరు డివిజన్

## అంబేద్కర్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తి

**- ఎమ్మెల్యే పాశిం సునీల్**



అంబేద్కర్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తి అని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ చెప్పారు. గూడూరు పట్టణం, అశోక్‌నగర్ అండర్ బ్రిడ్జి వద్ద గోను శివకుమార్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఇటీవల ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి.. మాట్లాడుతూ, అంబేద్కర్ రచించిన రాజ్యాంగం లేకపోతే దళితులు ఎక్కడ ఉండేవారని, దేశంలో ఉన్న పేదల అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని అన్నారు. విక్కీ, గోపాల్, ప్రకాష్, శివయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గూడూరు పట్టణంలోని వాటర్ ట్యాంకు వద్ద అంబేద్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో, టవర్ క్లాక్ సెంటర్ వద్ద ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సభ్యులు ఆధ్వర్యంలో, బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని పలు సేవాకార్యక్రమాలను నిర్వహించారు. వేగూరు రాజేంద్ర, డాక్టర్ చంద్రహాస్, గోపాల్, పులిమి శ్రీనివాసులు, తహశీల్దార్ చంద్రశేఖర్, కమిషనర్ వెంకటేశ్వర్లు, అట్రాసిటీ మెంబర్లు పెంచలయ్య, అరవ పార్వతయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

**చెన్నూరు పి.హెచ్.సి డాక్టర్ జ్యోతి**



క్యాన్సర్ పై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ జ్యోతి పేర్కొన్నారు. మంగళవారం గూడూరు మండల పరిధిలోని నెల్లటూరు గ్రామంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, బిపి, షుగర్ పరీక్షలతో పాటు మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్, పాప్‌స్మియర్ పరీక్షలను ఉచితంగా చేస్తున్నామన్నారు. ముందు జాగ్రత్తలతో క్యాన్సర్‌ను నివారించవచ్చని ఆమె అన్నారు. డాక్టర్ నాగరాజు, స్విమ్స్ మెడికల్ సిబ్బంది, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ రమణమ్మ,హెల్త్ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

**దేవాదాయ శాఖ భూములు**

## అక్రమిస్తే చర్యలు తప్పవు

**ఈవో నవీన్‌కుమార్**



గూడూరు పట్టణంలోని కోనేటి మిట్టలో ఉన్న శ్రీ కోదండ రామాంజనేయ స్వామి దేవస్థానానికి చెందిన స్థలంలో కొంతమంది రేకులషెడ్డు వేసి ఆక్రమించుకున్నారన్న వార్త తెలిసి ఈవో నవీన్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిబ్బందితో కలిసి రేకుల షెడ్డును తొలగించారు. ఐసిఎస్ రోడ్‌లో దేవాలయానికి సంబంధించి 75 అంకణాల స్థలం వివాదంలో ఉండగా కోర్టులో కేసు నడుస్తోంది. ఇంతలో కొంతమంది రాత్రికి రాత్రి రేకుల షెడ్డు వేశారు. దీంతో ఈవో నవీన్ ఆ ఆక్రమణను తొలగించారు.

## ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశం



తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో ఇటీవల తిరుపతి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ & మానిటరింగ్ కమిటీ ఛైర్మెన్‌ల ఆధ్వర్యంలో ఇటీవల సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ హర్షవర్ధన రాజు పాల్గొని జిల్లాలో ఎస్సీ ఎస్టీ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి, పరిష్కార మార్గాలు సూచించారు. కమిటీ సభ్యులు అరవ పార్వతయ్య, సయ్యద్ తాజుద్దీన్, పెంచలయ్యలు గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లోని ఎస్సీ ఎస్టీల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చి, వాటిని పరిష్కరించాల్సిందిగా కోరారు. జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రైతులకు సబ్సిడీ వ్యవసాయ పరికరాలు



గత ఐదు సంవత్సరాలలో రైతులకు ఉపయోగపడే ఒక్క కార్యక్రమం కూడా వైసీపీ ప్రభుత్వం చేయలేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సబ్సిడీతో రైతులకు వ్యవసాయ పరికరాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఇటీవల రైతులకు ప్రభుత్వం ద్వారా సబ్సిడీపై వ్యవసాయ పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే సునీల్‌కుమార్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా హాజరయ్యారు. వారిరువురూ ముందుగా స్టాల్స్‌ను పరిశీలించారు. రైతులకు వ్యవసాయ పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని రైతులు ఆర్థికంగా ఎదగాలని సూచించారు.

## ఎన్‌బికెఆర్‌లో జాతీయస్థాయి సదస్సు




కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల ఇసిఇ విభాగం ఆధ్వర్యంలో 'ఆక్సియాన్ 2కె25' జాతీయస్థాయి సాంకేతిక సదస్సు జరిగింది. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, ఇసిఇ విభాగాధిపతి డా. జి.హరినాథ్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి, సదస్సును ప్రారంభించారు. వారు మాట్లాడుతూ, విద్యార్థులు తమన దైనందిన జీవితంలో వస్తున్న మార్పులను, పరిణామాలను గుర్తించి, పరిస్థితులకు అనుగుణంగా ముందడుగు వేయాలన్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో సాంకేతిక వినియోగం అన్ని రంగాల్లో గణనీయంగా అభివృద్ధి చెందిందని, సాంకేతిక విజ్ఞానం లేని జీవితం దుర్లభంగా ఉంటుందని తెలిపారు. వివిఎల్ఎస్ఐ రంగంలో ఎన్నో ఉద్యోగావకాశాలు ఉన్నాయని, కష్టపడి చదువుని సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుంటూ విద్యార్థులు తమ భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమం సమన్వయకర్త డా.యు శ్రీనివాసులు మాట్లాడుతూ, విద్యార్థులు తాము సంపాదించుకున్న జ్ఞానాన్ని దేశప్రగతికి మాత్రమే వినియోగించాలని, సాంకేతికతను దుర్వినియోగం చేయరాదని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఉత్తమ పరిశోధనలకు, పత్ర సమర్పణ, పోస్టర్ ప్రెజెంటేషన్, ప్రాజెక్ట్స్ ఎక్స్‌పో, సర్క్యూట్ డీ-బగ్గింగ్, స్పాట్ ఈవెంట్స్‌లను నిర్వహించారు. వాటిలో ఉత్తమమైనవాటిని గుర్తించి ఆయా విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులందజేశారు. ఎక్స్‌టెండర్స్ అసోసియేషన్ ఇన్‌చార్జి డా నాగార్జున తదితరులు పాల్గొన్నారు.





జానకిరామ.. 61

# రామాయణం

- ఊటుకూరు జానకి రామారావు



లక్ష్మణుడి మాటలకు అడ్డుతగులుతూ, రామునితో ...

ఆర్యపుత్రా ఎంత చూడ చక్కగా ఉందో చూడు!

ఈ మృగం బాల సూర్య సమ ప్రభలతో మెరిసిపోతోంది, దానిని చూడగానే నా హృదయం మురిసిపోతోంది. అయోధ్యలో మన అంతఃపురంలో ఇది ఉంటే ఎంత బాగుండును అని అనిపిస్తోంది, అత్తగార్లకు, భరతుడికి ఇది గొప్ప కనువిందు కాగలదు.

ఒకవేళ సజీవంగా మనం దీనిని పట్టుకోలేకపోతే దీని చర్మమైనా మనకు మిగులుతుంది.

అప్పుడు మెత్తని లేతగడ్డి పరుచుకొని దీని మీద కూర్చుంటే అబ్బ! ఎంత సుఖంగా ఉంటుందో కదా!

ఆర్యపుత్రా దీనిని పట్టి తెమ్ము... అని సీతాదేవి పలుకుతుంటే రాముడు కూడా దాని మీదనుండి దృష్టి మరల్చుకోలేకపోయాడు.

మణిమయ కాంతులు వెదజల్లే దాని కొమ్ములు, బంగారు వన్నెలతో మెరిసిపోతున్న శరీరం, ఆయన మనస్సును కూడా ఆకర్షించింది.

సీతాదేవి ఇంతగా ప్రేరేపిస్తుంటే లక్ష్మణునితో అంటున్నాడు రాముడు.

లక్ష్మణా, అదుగో చూడు మీ వదిన ఎంతగా ముచ్చటపడు తుందో, అసలిలాంటి మృగం నందనవనంలోగానీ, మరి ఏ ఇతర దేవతల ఉద్యానవనాలలో గానీ ఉండదు, మరి భూలో కంలో ఎట్లా ఉంటుంది.

అదుగో చూశావా! అది ఆవులించినప్పుడు దాని నోటినుండి అగ్నిజ్వాల వలే ప్రకాశిస్తూ నాలుక బయటకు వస్తుంది. దాని వంటి మీద వెంట్రుకలు చూడు బంగారుచుక్కలచేత రమ్యంగా ఉన్నాయి.

దాని పొట్ట శంఖంలా ఉంది చూడు, ఇంద్రనీలాలు పొదగబడిన పాత్రలా ఉంది, ఓహ్ దీని సౌందర్యం మనస్సును విపరీతంగా ఆకర్షిస్తోంది.

లక్ష్మణా ఇంత అందమైన మృగం మనకు గొప్ప సంపద కాగలదు.

ఎవడు ముందు వెనుకలు ఆలోచించకుండా ముందుకు పోయి ధన సంపాదన చేయునో ఆ సంపాదనే సంపాదన.. అదియే ధనమని అర్ధశాస్త్ర నిపుణులు చెపుతారు.

ఈ జింక చర్మం మీద నేను, సీత కూర్చోవాలని నా మనస్సు తహతహ లాడుతోంది.

ఒకవేళ నీవు చెప్పినట్లు ఇది మారీచుడే అయితే కానీ, ఈరోజుతో వాడి ఆయువు మూడినట్లే అనుకో.

అగస్త్యుడి చేతిలో వాతాపి మరణించినట్లు, నా చేతిలో మరణించగలడు.

లక్ష్మణా నీవు సావధాన చిత్తుడవై ధనుర్బాణాలు ధరించి సీతను కాపాడుతూ ఉండు, నేను దీనిని వేటాడతాను. అని పలికి.. బంగారు ఖడ్గాన్ని నడుముకు కట్టుకొని మూడు వంపు లున్న ఒక ధనుస్సు చేతబూని రెండు అమ్ములపొదులు ధరించి బయలుదేరాడు శ్రీరామచంద్రుడు.

కోదండపాణి బయలుదేరాడు,

బంగారు పిడి గల ఖడ్గం, ధనుస్సు ధరించి మృగాన్ని చూస్తూ దానిని పట్టుకోవాలని తలపోస్తూ దాని వెంట నడిచాడు.

అది తప్పించుకొని చెంగుచెంగున గెంతుతూ దూరంగా కనపడకుండా వెళ్ళిపోయింది, అరే కనపడలేదే! అని రాముడు అనుకునే లోపు మరలా దగ్గరగా ప్రత్యక్షమయ్యేది, దానిని పట్టుకుందామని చూస్తే దొరకకుండా దూరం వెళ్ళేది, అది ఆ విధంగా రాముడిని ఆశ్రమం నుండి చాలా దూరం తీసుకువెళ్ళింది.

మబ్బులలో దాగున్న చంద్రుడు కాసేపు మబ్బులలో ఉండి, కాసేపు బయటకు వచ్చి ఏ విధంగా దోబూచులాడుతుం టాడో.. ఆ విధంగా కనపడీ కనపడకుండా, దగ్గరగా కాసేపు దూరంగా కాసేపు ఆటలాడుకుంటూ తీసుకెళ్ళింది.

అప్పటికే చాలా దూరం దానివెంట పరుగెత్తిన రాముడు అలసటతో ఒక పచ్చిక బయలుమీద కూర్చున్నాడు.

మరల ఆ మృగం అల్లంత దూరంలో కొన్ని ఇతర మృగా లతో కలిసి తిరుగుతున్నట్లుగా కనపడింది.

అది తన చేతికి అందదు అనే విషయం అప్పటికే ఆయనకు అర్ధమయ్యింది, ఇక దానిని చంపేయాలని నిశ్చయించుకున్నాడు.

బాణాన్ని అమ్ములపొది నుండి బయటకు తీశాడు, దృఢమైన ధనుస్సుపై ఎక్కుపెట్టాడు, ఆకర్ణాంతం లాగి వదిలాడు. అది బుసలు కొడుతున్న త్రాచుపాములా రయ్యిన గాలిని చీల్చుకుంటూ వెళ్లి ఆ మృగం శరీరాన్ని భేదించి దాని హృదయాన్ని బద్దలు కొట్టింది. రామబాణం ఎప్పుడైతే దాని శరీరాన్ని తాకిందో అప్పుడే రాక్షస మాయకూడా తొలగిపోయి భయంకరరూపంతో కొండలాగా ఉన్న మారీచుడు బహిర్గతమైనాడు.

ఆ బాణపు దెబ్బకు విలవిలలాడుతూ తనకు చివరి క్షణాలు దగ్గర పడ్డాయని గ్రహించాడు మారీచుడు.

ఆ సమయంలో కూడా వాడు స్వామి భక్తి ప్రదర్శించాడు, రావణుడి కార్యం నెరవేరాలంటే ఏమి చెయ్యాలో ఆలోచించాడు. ఏమి చేస్తే సీతాదేవి లక్ష్మణుని ఇక్కడికి పంపుతుంది?అని బుర్రకు పదును పెట్టాడు.

రాముడు ఆపదలో ఉన్నాడన్న భావం ఆవిడ మదిలో కలుగచేయాలని నిర్ణయించుకున్నాడు. వెంటనే స్వరం మార్చి రాముని గొంతును అనుకరించాడు.

అయ్యో సీతా, అయ్యో లక్ష్మణా..

అని ఆ వనమంతా ప్రతిధ్వనించేటట్లు గావుకేకలు పెట్టి ప్రాణం వదిలాడు.

చూడటానికే భయంకరంగా ఉన్న ఆ కళేబరాన్ని చూసి వాడు మారీచుడు అని గుర్తు పట్టాడు రాముడు. తమ్ముడు చెప్పిన విషయం గుర్తుకు వచ్చింది, వాడు అరచిన అరుపులు ఎక్కడికి దారితీస్తాయో అని ఒక ఊహ ఆయన మదిలో మెదిలింది.

ఒక్కసారిగా వళ్ళు జలదరించింది.

ఎందుకో మరి! కొన్ని ఆలోచనలు ఆయనలో ఒక దుఃఖాన్నీ, భయాన్నీ కలుగచేశాయి.

వెంటనే వడిగా, వడివడిగా ఆశ్రమం వైపు పరుగు తీశాడు రాముడు.

ఎదో స్వరం దీనంగా వినపడుతున్నది, అది ఎవరిదో ఆర్తనాదమే!

అవును! ఆ స్వరం నా నాధుడిదే!

ఏమి ఆపదలో చిక్కుకున్నాడో ఏమో, పాపం ఆమె హృదయం తల్లడిల్లిపోయింది .

వెంటనే లక్ష్మణునితో "నీవు వెళ్లి రామునికి ఏమైందో తెలుసుకోనిరా!" అని పలికింది సీతమ్మ.

ఆ అరుపులు సింహం నోట్లో చిక్కి విలవిలలాడుతూ రక్షించమని అంబారవాలు చేసే ఎద్దు దీనాలాపాలుగా ఉన్నాయి.

నా ప్రాణం, హృదయం పరితపిస్తున్నాయి.. రామునికి ఏ ఆపద వచ్చినదోయని.

నీ సోదరుడు రక్షణ కోరుతున్నాడు.

నీవు త్వరగా వెళ్ళు అని సీతాదేవి మరలమరల పలికింది.

సీతాదేవి అంతగా చెప్పినప్పటికీ లక్ష్మణుడు అన్నగారి ఆజ్ఞకు బద్ధుడై అంగుళం కూడా కదలలేదు.

సీతాదేవి కుపితురాలైంది.

ఒక ప్రక్క తన భర్తకు ఏమైందో అన్న ఆందోళన ఆమెలోని ఆలోచనను, విచక్షణను కోల్పోయేలా చేసింది.

లక్ష్మణా! నీకు నామీద గల కోరిక చేత నీ అన్నకు వచ్చిన ఆపదను పట్టించుకోవటంలేదు.

నీవు మిత్రుడి రూపంలో ఉన్న శత్రువు, ఆ విషయం నీ అన్న తెలుసుకోలేకపోయాడు. నీకు నా మీద ఆశ ఉండుట చేత అన్నకు కష్టం వచ్చినప్పటికీ అడుగు ముందుకు వేయడంలేదు, ఆయనకా కష్టం కలగాలనే నీవు కోరుకొంటున్నావు.

ఇప్పుడు రాముడు కష్టాలలో ఉన్నాడు, ఆయనను రక్షించడమే నీ ప్రధాన కర్తవ్యం నన్ను రక్షించడం కాదు.

అని ఒక ఉన్మాదినిలాగా మాట్లాడుతున్న సీతాదేవిని చూసి, "రాముడంటే ఏమనుకున్నావు పరాక్రమంలో ఆయన సాటి నిలువగల వారు మూడులోకాలలో ఎవరూ లేరు.

పన్నగ, గంధర్వ, అసుర, మానవ, దేవతా గణాలలో నీ భర్తను జయించగలవారెవ్వరూ లేరు.

రాముణ్ణి యుద్ధంలో జయించగలగటం కలలో కూడా జరుగని పని.

నీవు ఈ విధంగా మాటలాడటం తగదు.

నిన్ను ఒంటరిగా ఈ అడవిలో విడిచి వెళ్ళను. ఇది రామాజ్ఞ. నిన్ను నా రక్షణలో ఉంచి ఆయన వెళ్ళాడు.

నీవు విన్నది రాముని స్వరం కాదు, అది మాయావులైన రాక్షసుల పని. అది ఒక ఇంద్రజాలం.

..(సశేషం)

# మోదీ 3.0లోనూ దూకుడే!

మనసులో మాట 41

కేంద్రంలో మూడో విడత అధికారం చేపట్టిన నరేంద్రమోదీ ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయాలను కొనసాగిస్తోంది. భారతీయ జనతా పార్టీకి లోక్‌సభలో పూర్తిస్థాయి ఆధిక్యం లేకున్నా కొన్ని నిర్ణయాల విషయంలో వెనక్కు తగ్గడంలేదు. మొదటి రెండు విడతల్లో పెద్ద నోట్ల రద్దు, 370 అధికరణం రద్దు, రామజన్మభూమి నిర్మాణం వంటి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్న మోదీ ప్రభుత్వం, మూడో విడత ఆచితూచి వెళ్తుందని అందరూ అనుకున్నారు. ఎందుకంటే లోక్‌సభలో భారతీయ జనతాపార్టీకి పూర్తిస్థాయి ఆధిక్యం దక్కలేదు. తెలుగుదేశం, జేడీయూ వంటి భాగస్వామ్య పక్షాలతో కలిసి పోటీచేసి వాటితో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే భారతీయ జనతా పార్టీ సైద్ధాంతిక అజెండా అమలును ముందుకు తీసుకెళ్లాలనే నిర్ణయించుకున్నట్లు వక్ఫ్ సవరణ చట్టం తీసుకురావడం ద్వారా తేటతెల్లమయింది. ఇది ఎవరూ ఊహించనిది. ఎందుకంటే తెలుగుదేశం, జేడీయూ వంటి భాగస్వామ్య పార్టీలకు ముస్లిం ఓటు బ్యాంకు ఉంది. ఆ పార్టీలు అంగీకరించవని అందరూ భావించారు.

ఒక రకంగా చెప్పాలంటే 370 అధికరణం రద్దు కన్నా సాహసోపేతమైన నిర్ణయం ఇది. ఎందుకంటే ఈ నిర్ణయం ప్రభావం నేరుగా దేశవ్యాప్తంగా ఉం టుంది. కానీ, కూటమిలోని పక్షాలు గతంలో మాదిరిగా కాకుండా, ఇచ్చిపుచ్చుకునే ధోరణితో ఉన్నట్లు వక్ఫ్ సవరణ చట్టం ద్వారా అర్థమవుతోంది. కూటమిలోని పక్షాలు ఈ బిల్లుకు మద్దతు ఇవ్వడంలో ఆశ్చర్యం లేదు. వైకాపా ఎంపీలు కూడా మద్దతు ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. ఈ బిల్లుకు సంబంధించి తెలుగుదేశం పార్టీ సూచించిన కొన్ని అంశాలకు ప్రభుత్వం అంగీకరించినట్లు తెలుస్తోంది. ఇలాంటి అంశాల్లో గతంలో లాగా ఏకపక్షంగా వ్యతిరేకించకుండా మధ్యేమార్గంగా వెళ్లడం వల్ల రాష్ట్ర ప్రయోజనాలను సాధించుకోవచ్చని తెలుగుదేశం అధినేత భావిస్తున్నట్లు తెలుస్తోంది. రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం నిర్మాణంతో పాటు పెట్టుబడిదారులను ఆకర్షించడంలో కేంద్రప్రభుత్వం సహకారం కావాలన్నది చంద్రబాబునాయుడికి తెలియంది కాదు. అలాగే సైద్ధాంతిక నిర్ణయాల అమలు గతంలో లాగా సులువైన విషయం కాదని, భాగస్వామ్య పక్షాల సహకారం కావాలని మోదీకి కూడా తెలుసు. అందుకే ఉభయులూ ఎవరికి కావాల్సింది వారు నెరవేర్చు కోవడానికి ఇచ్చిపుచ్చుకునే ధోరణిని అనుసరిస్తున్నారు. వక్ఫ్ చట్టం–1995లోని సెక్షన్ 40 ప్రకారం ఏదైనా ట్రస్టు లేదా సొసైటీ ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా నమ్మితే దానిని వక్ఫ్ ఆస్తిగా నిర్ణయించే అధికారం వక్ఫ్ బోర్డులకు దఖలు పడింది. ఈ సెక్షన్‌ను దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మరే ఇతర మతాలకు చెందిన సంస్థలకు కూడా ఇలాంటి ఏకపక్ష అధికారం లేదు. ఇప్పుడు చట్టసవరణ ద్వారా ఈ సెక్షన్‌ను రద్దు చేశారు. మోదీ ప్రభుత్వం మూడో విడత అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ బిల్లు విషయమై చంద్రబాబునాయుడు, దేవెగౌడ, నీతీశ్‌కుమార్ తదితర నేతలతో సంప్రదింపులు జరుపుతూ వచ్చింది. ఆ నేతల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుని బిల్లుకు తుదిరూపం ఇచ్చి స్థాయీ సంఘానికి పంపించి ఆమోదం పొందింది.

మూడో విడత అధికారంలోకి వచ్చిన తర్వాత నరేంద్ర మోదీ ప్రభుత్వం మరో ఘన విజయాన్ని సాధించింది. 26/11 దాడిగా ప్రసిద్ధమైన ముంబయి ఉగ్ర దాడుల సూత్రధారి తహవ్వుర్ హుస్సేన్ రాణాను భారత్‌కు రప్పించి కోట్ల మంది భారతీయుల మనసును మోదీ ప్రభుత్వం గెలుచుకుంది. ఆనాటి ఉగ్రదాడిలో ఆరుగురు అమెరికన్లు సహా 166 మంది మరణించారు. ముంబయి దాడులు జరిగిన ఏడాది అనంతరం 2009 అక్టోబరులో రాణా అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బిఐ చేతికి చిక్కి లాస్ ఏంజెల్స్‌లోని మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్లో నిర్బంధంలో ఉన్నాడు. అమెరికా తనను భారత్‌కు అప్పగించకుండా ఉండేందుకు శతవిధాలా ప్రయత్నిం చాడు. భారత్‌కు తనను అప్పగించవద్దంటూ అమెరికా సుప్రీంకోర్టులో రాణా వేసిన పిటిషన్ను కోర్టు కొట్టేసింది. దీంతో లాస్ ఏంజెలెస్ నుంచి తహవ్వుర్ రాణాను అత్యంత కట్టు దిట్టమైన భద్రత నడుమ ప్రత్యేక విమానంలో గత గురువారం దిల్లీకి తీసుకొచ్చారు. పటియాల హౌస్ కోర్టులో హాజరుపర్చారు. ఎన్ఐఏ కోర్టు అతనికి 18 రోజుల ఎన్ఐఏ కస్టడీ విధించింది

రాణాను భారత్‌కు రప్పించేందుకు మోదీ ప్రభుత్వం చేసిన కృషి అంతా ఇంతా కాదు. 2011లో మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ముంబయి దాడుల్లో రాణాకు ప్రత్యక్ష ప్రమేయం లేదని అమెరికా న్యాయస్థానం ప్రకటించింది. దీనిపై మోదీ అప్పట్లో కేంద్రంలో అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. "ముంబయి దాడుల్లో రాణాను అమాయకుడని అమెరికా ప్రకటించడం భారతదేశ సార్వభౌమత్వాన్ని అగౌరవపర్చడమే. ఇది ఖచ్చితంగా భారతదేశ విదేశాంగ విధానవైఫల్యమే" అని యూపీఏ ప్రభుత్వాన్ని విమర్శించారు. ఆ తర్వాత 2014లో అధికారంలో వచ్చినప్పటినుంచి రాణా అప్పగింత విషయంలో అమెరికాతో న్యాయ మార్గాల్లో, దౌత్య మార్గాల్లో కృషి చేస్తూ వచ్చారు. దాడుల్లో రాణా ప్రమేయంపై గట్టి సాక్ష్యాధారాలను అక్కడి న్యాయస్థానాలకు అందజేశారు. పాకిస్థాన్లో పుట్టిపెరిగి కెనడా పౌరసత్వాన్ని పొంది అమెరికాలో స్థిరపడిన రాణాకు ముంబయి దాడుల్లో పాకిస్థాన్‌కు చెందిన ఎవరెవరి ప్రమేయమున్నదీ ఖచ్చితంగా తెలుసు. రాణాను రప్పించడంతో పాకిస్థాన్ కుటిల యత్నాలన్నీ బయటపడే అవకాశముంది. అందుకే ఇది భారత్‌కు గొప్ప విజయం. ఈ రెండు విజయాల నేపథ్యంలో మోదీ 3.0లో మరిన్ని అనూహ్య నిర్ణయాలు వెలువడే అవకాశాలున్నాయి. పూర్తిస్థాయి అధికారం ఉన్నా లేకున్నా తాను అనుకున్న లక్ష్యాలను సాధించడానికి మోదీ వెనకాడరని ఈ రెండు సంఘటనలను బట్టి అర్థమవుతుంది.



తుమ్మల బాల గంగాధర్ తిలక్

# ప్రగతి రథ సారథుడు

(మొదటిపేజీ తరువాయి)

నిజం గడపదాటేలోపు అబద్ధం ప్రపంచాన్నే చుట్టేస్తుంది, చేసిన మంచి పక్కవాడి చెవికి చేరేలోపే, చెడు చేంతాడంత దూరం పాకిపోతుంది. అవును సత్యం కంటే అసత్యానికి తొందరెక్కువ, తోడుండేవారూ ఎక్కువ. అయితే, అంతిమ విజయం మాత్రం సత్యానిదే. ఇదేసూత్రం రాజకీయాలకూ వర్తిస్తుంది. ఎప్పుడూ అరుపులు, ఆగిత్యాలు, తప్పుడు విధానాలు, తప్పటడుగులు, దోపిడీలు, దౌర్జన్యాలు, అవినీతి, అక్రమాలు, ఇవే చాలామంది రాజకీయ నాయకులకు మణిహారాలు. వాటితోనే వారు పదవులు పొందు తారు. అయితే సేవే పరమావధిగా, ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా, అభివృద్ధే మంత్రంగా, చేపట్టిన పదవే పాశుపతాస్త్రంగా భావించి క్రమశిక్షణతో, నిలకడగా పేదల అభ్యున్నతికి పాటుపడే నాయకులు అత్యంత అరుదు. వారు ఆలస్యంగా అయినా, అందనంత ఎత్తుకు ఎదుగుతారు. చరిత్రలో నిలిచిపోతారు. ఆ కోవలోకి వస్తారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం సారథి నారా చంద్రబాబునాయుడు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి దిగ్గజ రాజకీయ చాణుక్యుడిగా ఎదిగిన ఆయన ప్రస్థానం అపురూపం, అనితరసాధ్యం, అనన్య సామాన్యం, అనుసరణీయం.

## అడుగడుగునా చరిత్రే..

1950 ఏప్రిల్ 20వతేదీన ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని నారావారిపల్లెలో నారా ఖర్జూరపునాయుడు, అమ్మణ్ణమ్మ దంపతులకు చంద్రబాబునాయుడు జన్మించారు. ఈయకు ఓ తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్ల ఉన్నారు. పాఠశాల చదువు స్థానిక పాఠశాలలోనూ హైస్కూల్ విద్య చంద్రగిరిలోనూ పూర్తి చేశారు. 1972లో తిరుపతి శ్రీవెంకటేశ్వర ఆర్ట్స్ కాలేజీ నుంచి బీఏలో డిగ్రీ పట్టా పుచ్చుకున్నారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్‌లో పీజీ చేశారు. విద్యార్థి నాయకుడిగా తన తొలి రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1975లో యూత్ కాంగ్రెస్‌లో చేరారు. పులిచెర్ల సమితి ప్రెసిడెంట్‌గా మొట్టమొదటి రాజకీయ పదవి పొందారు. ఈ సమయంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీని ప్రకటించడంతో కాంగ్రెస్‌పై తీవ్రవ్యతిరేకత వ్యక్తమైంది. అయినా దాన్ని తట్టుకుని అధిష్ఠానం ఆదేశాల మేరకు కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేశారు. అదే సమయంలో దివిసీమ తుపాను రావడంతో బాధితుల సహాయార్థం పెద్దఎత్తున విరాళాలు సేకరించి చంద్రగిరి నియోజక వర్గంలో తిరుగులేని గుర్తింపు సంపాదించారు. ఇది ఆయన రాజకీయ జీవితానికి అద్భుతంగా ఉపయోగ పడిందని విశ్లేషకులు భావిస్తారు. ఇదే ఊపుతో నియో జకవర్గంలోని అన్నివర్గాల వారికి ఉత్తరాల ద్వారా తనను తాను పరిచయం చేసుకుని ప్రత్యేక రాజకీయ శైలికి నాందిపలికారు.

## రాజకీయాల్లో అజేయశక్తిగా..

1978లో తొలిసారి కాంగ్రెస్ యువజన విభాగం తరపున చంద్రగిరి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకిదిగారు. భారీ విజయంతో అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. చంద్రబాబు చురుకుదనం గుర్తించిన అధిష్ఠానం ఆయన్ని కేబినెట్‌లోకి తీసుకుని టంగుటూరి అంజయ్య మంత్రివర్గంలో చోటు కల్పించింది. ఏకంగా సినిమాటోగ్రఫీ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన రాష్ట్రవ్యాప్తంగా పరిచయాలు పెంచు కున్నారు. అదే సమయంలో ఎన్టీఆర్‌తో సాన్నిహిత్యం ఏర్పడి 1980లో ఆయన రెండో కుమార్తె నారా భువనేశ్వరిని వివాహమాడారు. తర్వాత కాలంలో 1982లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించినా అందులో చేరలేదు. అయితే 1983 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి చేతిలో చంద్రబాబు ఓటమిపాలయ్యారు. తర్వాత కాంగ్రెస్‌ను వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీ జనరల్ సెక్రటరీగా రాణించారు. 1989 ఎన్నికల్లో తెలుగుదేశం ఓటమి పాలైందన్న, ఆవేదనతో ఎన్టీఆర్ అసెంబ్లీకి రాకపోవడంతో పార్టీకి చంద్రబాబు పెద్దదిక్కుగా మారారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడి పదవి చేపట్టి పార్టీపై తిరుగులేని పట్టు సంపాదిం చారు. సారా వ్యతిరేక ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి రాష్ట్రవ్యాప్తంగా ఇమేజ్ పెంచుకున్నారు. 1994 ఎన్నికల్లో తెలుగుదేశం మరోసారి ఎన్నికవడం ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా, చంద్రబాబు రెవెన్యూశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం పార్టీలో నెలకొన్న పరిణామాలతో 1995 తొలిసారి ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. అదే ఊపుతో 1999 ఎన్నికల్లో తిరుగులేని మెజారిటీతో ప్రజాక్షేత్రంలో గెలిచి రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారు.

## సంస్కరణలకు ఆద్యుడిగా.. జాతీయస్థాయి నేతగా..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏకధాటిగా 9 సంవత్స రాలు ముఖ్యమంత్రిగా పనిచేసి రికార్డు సృష్టించడమే కాకుండా అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలతో తనదైన శైలిలో పాలనను పట్టాలెక్కించారు. జన్మభూమి, శ్రమ దానం, పచ్చదనం పరిశుభ్రత, దీపం పథకంలో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, డ్వాక్రా సంఘాల ఏర్పాటు, ప్రజలకు వద్దకు పాలన పేరుతో అధికార యంత్రంగాన్ని పరుగులు పెట్టించారు. ఇక 1998లో హైదరాబాద్‌లో సైబర్‌టవర్స్‌కి శ్రీకారం చుట్టి హైటెక్ సిటీకి పునాది వేశారు. దీంతో క్రమంగా హైదరాబాద్ ఐటీహబ్‌గా మారింది. ఇదే క్రమంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్, మైక్రోసాఫ్ట్ అధినేత, ప్రపంచ కుబేరుడు బిల్‌గేట్స్‌ను ఆంధ్రప్రదేశ్‌కు రప్పించి శాశ్వతకీర్తి గడించారు. ఇక 1999లో జినోమ్ వ్యాలీ పేరుతో ఫార్మాస్యూటికల్ కంపెనీలతో ఫార్మాసిటీని ప్రారంభించి ప్రపంచ ఫార్మారంగంలో హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. ఇదే క్రమంలో బేగంపేట విమానాశ్రయం రద్దీని తట్టుకో లేకపోతుండడంతో శంషాబాద్ అంతర్జాతీయ విమా నాశ్రయానికి బీజం వేశారు. ఇక విజన్ 2020 పేరుతో గ్రామీణాభివృద్ధి, వ్యవసాయరంగంలో కార్పొరేట్ శక్తుల రాక, ఉపాధి, ఉత్పాదక పెంచడం కోసం ప్రణాళికలు రూపొందించి దిగ్గజరాజకీయ నాయకుల సరసన చోటు సంపాదించారు. ఇక కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే నేషనల్ డెమాక్రటిక్ అలయన్స్ ఏర్పాటులో అప్పటి ప్రధాని వాజ్‌పేయ్‌తో కలిసి ముఖ్యభూమిక పోషించారు. తద్వారా జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పారు. ఎన్డీయే కన్వీనర్‌గా కూడా పనిచేశారు.

## ఉన్నతపదవుల ఎంపికలో కీలకపాత్ర

అనేక కీలక పదవుల్లో నేతల ఎంపిక విషయంలో చంద్రబాబు కీలకపాత్ర పోషించారు. భారతదేశం స్వాతంత్ర్యం పొంది స్వర్ణోత్సవాలు చేసుకుంటున్న సమయంలో దళిత నాయకుడు కేఆర్ నారాయణన్ రాష్ట్రపతి కావడంలోనూ, శాస్త్రవేత్త అబ్దుల్ కలాంను రాష్ట్రపతిగా ఎన్నుకోవడంలోనూ చంద్రబాబు విశేష కృషి చేశారు. అలాగే ఏపీ గవర్నర్‌గా పనిచేసిన కృష్ణకాంత్‌ను ఉపరాష్ట్రపతి చేయడంలోనూ ముఖ్య భూమిక పోషించారు. దళిత నేత జీఎంసీ బాలయోగిని లోక్‌సభ స్పీకర్ చేసి విశేష ఖ్యాతిగడించారు. బీసీ సబ్‌ప్లాన్‌కు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రిగా, పట్టి సీమతో గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేసిన నాయకుడిగా రికార్డు సృష్టించారు. ఇక విభజిత ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధానిగా అమరావతిని ఎంపికచేసి ప్రపంచంలోనే ఎవరూ చేయని విధంగా రైతుల నుంచి 32 వేల ఎకరాలు భూసేకరణ చేసి జీవితకాల ఘనతను సాధించారు. టైమ్స్ మ్యాగజైన్ కవర్‌పేజీ(ముఖచిత్రం)పై ఎక్కిన తెలుగునేతగా అరుదైన గుర్తింపును చంద్రబాబు సాధించారు.

## సమస్యలనే తనకి అనుకూలంగా మార్చుకుంటూ..!

ఇక చంద్రబాబు తన జీవితకాలంలో అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. ఇందులో అతిపెద్ద కుదుపు 2003 అక్టోబర్ 1వ తేదీన తిరుమల అలిపిరి మార్గంలో నక్సలైట్లు క్లైమోర్‌మైన్స్ పేల్చి చేసిన దాడి. అయినా ఆయన ప్రాణాలతో బయటపడి మళ్లీ మొక్కవోని దీక్షతో రాజకీయాల్లో రాణించడం గమ నార్హం. ఇక 2000లో కేసీఆర్‌తో విభేదాలు రావడం, ఆయన 2001లో టీఆర్ఎస్‌ను ఏర్పాటు చేయడం వల్ల తెలంగాణలో చంద్రబాబు ప్రభ కోల్పోయారు. ఇక 2004లో వైఎస్సార్ పాదయాత్ర కారణంగా ఏకంగా అధికారం నుంచే దిగిపోవాల్సి వచ్చింది. అదే క్రమంలో 2004 నుంచి 2014 వరకు ప్రతిపక్ష నేతగా కష్టకాలం ఎదుర్కొన్నారు. ఈ కాలంలోనే 2008లో చిరంజీవి పీఆర్పీ ఆవిర్భావం, 2010లో వైఎస్ జగన్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావాలను చవిచూశారు. వాటితో పోటీపడేందుకు శాయశక్తులా యత్నించారు. తర్వాత ఆరుపదుల వయసులో రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేపట్టి మళ్లీ ప్రజామోదం పొంది 2014లో ముఖ్యమంత్రి పీఠం అధిష్ఠించారు. 2019లో అధికారం కోల్పోవడం 2023లో స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టవడం, జైలు కెళ్లడం తర్వాత ప్రజల ముందుకు వెళ్లి సూపర్‌సిక్స్ హామీలతో మళ్లీ నాలుగోసారి ముఖ్యమంత్రి కావడం ఆయనకే చెల్లింది. ప్రతీసారీ తనకి వచ్చే సమస్యనే తనకి అనుకూలంగా మార్చుకోవడంలో దిట్ట చంద్రబాబు. అందుకే ఆంధ్రప్రదేశ్ దశాదిశ నిర్ణయించడంలో చంద్రబాబుది కీలకపాత్ర అని విశ్లేషకులు అభిప్రాయ పడతారు. ఏ నాయకుడికి లేని అనుబంధం తెలుగు ప్రజలతో చంద్రబాబు పెనవేసుకున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. కాబట్టే ఆయన అరెస్టు సమయంలో హైదరాబాద్ సహా అనేక దేశాలు, రాష్ట్రాల నుంచి తెలుగు ప్రజలు, యువత తండోపతండాలుగా రాజమండ్రికి క్యూకట్టారు. మేమున్నామంటూ మళ్లీ గెలిపించుకుని భుజాలకెత్తుకున్నారు. అవును చంద్రబాబు ఆంధ్రుల అభిమాన నేతగా, అధినేతగా ఎప్పటికీ నిలిచిపోతారనడంలో ఎలాంటి సందేహంలేదు. తిరుగులేని, ఎదురులేని, అదురులేని, బెదురులేని నాయకుడిగా ఆయన తెలుగువారి హృదయాలలో నిలిచిపోతారు. ఆయన 75వ జన్మదినం సందర్భంగా 'లాయర్' పాఠకుల కోసం ఈ ప్రత్యేక వ్యాసం.

'లాయర్' విషస్ ఏ వెరీ హ్యాపీ బర్త్‌డే టు బాబు..!


# కల్యాణ వైభవం...!

సుచరిత - ప్రసన్న



శ్రీరాజ్ హైర్స్ అధినేత, శ్రీ కస్తూరిదేవి రవీంద్రనాథ్ రాగూర్ ఆడిటోరియం నిర్వాహకుడు ప్రత్తి శ్రీనివాసులు - శ్రీమతి శాంతిల కుమార్తె (కీ॥శే. ప్రత్తి సూరి మనుమరాలు) సుచరిత - వెంకట ప్రసన్నకుమార్‌ల వివాహం ఏప్రిల్ 11వ తేదీ శుక్రవారం నెల్లూరులో జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనలు.

# జిల్లా జడ్జిగా..బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్



నెల్లూరుజిల్లా ప్రధాన న్యాయమూర్తిగా జి.శ్రీనివాస్ ఈనెల 16న బాధ్యతలు చేప ట్టారు. అనంతపురంలో జిల్లాజడ్జిగా పని చేస్తున్న ఆయన, బదిలీపై నెల్లూరుకు వచ్చారు. ఈ స్థానంలో ఉన్న జిల్లా జడ్జి యామిని, కడపజిల్లా ప్రధాన న్యాయ మూర్తిగా బదిలీ అయిన విషయం తెలి సిందే. కాగా, ఈ నెల 17న జిల్లా కోర్టులో ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌ను జిల్లా కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్‌లు గౌరవపూర్వ కంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు.

# 20న..'వేద విజ్ఞాన వేదిక' సభ

చెన్నై–టీనగర్‌లో ఉన్న 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహికలో 160వ ప్రసంగంగా 'హరి కథా లహరి–నిత్య నూతన సుధా మాధురి' అనే అంశంపై సారస్వతోపన్యాసం ఏర్పాటుచేశారు., ఈనెల 20వ తేది సాయంత్రం 6.30 గంటలకు ప్రముఖ రచయిత్రి డా.ప్రభల జానకి ఆ అంశంపై ఉపన్యసిస్తా రని, టీ–నగర్‌లోని కృష్ణాహాల్ ఆంధ్రాక్లబ్‌లో ఈ కార్యక్రమం ఉంటుందని, సాహిత్యాభిమానులందరూ విచ్చేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వేదవిజ్ఞాన వేదిక అధ్యక్ష కార్యదర్శులు జేకే రెడ్డి, కందనూరు మధు ఒక ప్రకటనలో కోరారు.

# డీఎస్సీ కోసం.. డీవైఎఫ్ఐ ఆందోళన


రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామకాలకి సంబం ధించి డీఎస్సీ నోటిఫికేషన్‌ను వెంటనే ప్రకటించా లంటూ నెల్లూరులోని డీవైఎఫ్ఐ నాయకులు ఈనెల 16న ఆందోళన చేపట్టారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం కూడలి వద్ద నుంచి కలెక్టరేట్ దాకా ర్యాలీ నిర్వహిం చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే డీఎస్సీని ప్రకటిస్తామని హామీ ఇచ్చినా, నేటివరకు అది ఆచర ణకు రాలేదంటూ విచారం వ్యక్తం చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ, అధ్యక్షుడు నరసింహం, రూరల్ కన్వీనర్ చైతన్య, జగదీష్, ఫయాజ్, శేఖర్, మహేష్, వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# 'ఆటోనగర్'తో బుచ్చి యువతకి ఉపాధి

## • శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



ఎంతోకాలం నుంచి బుచ్చి ప్రజలు ఎదురుచూస్తున్న ఆటోనగర్ శంకుస్థాపన ఎట్టకేలకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సారథ్యంలో సాకారమవుతోంది. మొన్ననే ఆమె 'ఆటోనగర్' ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం స్థానిక ప్రజల్లో సంతోషం కలిగించింది. దీని నిర్మాణం పూర్తయితే ఎంతోమంది యువతకు ఉపాధి దొరుకుతుంది కూడా. బుచ్చి పట్టణ శివార్లలోని నాగమాంబాపురం వద్ద ఆటోనగర్ నిర్మాణానికి ఇటీవల ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా బుచ్చి మెకానిక్ అసోసియేషన్‌కు చెందిన ఆటో టెక్నీషియన్లు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని ఘనంగా స్వాగతించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆటోనగర్ శంకుస్థాపన ద్వారా బుచ్చిరెడ్డిపాళెం ప్రాంత అభివృద్ధికి అంకురార్పణ మొదలైందన్నారు. ముఖ్యంగా, బుచ్చిరెడ్డిపాళెం మెకానిక్ సోదరుల చిరకాల స్వప్నమైన ఆటోనగర్ భూమిపూజ కార్యక్రమం తన చేతులమీదుగా జరగడం తనకెంతో ఆనందం కలిగిస్తోందన్నారు. కనీస వసతులు లేక రోడ్ల పక్కన మెకానిక్ షెడ్లు నిర్వహించుకుంటున్న దాదాపు 150 మంది మెకానిక్‌లు, వెల్డర్‌లు, తదితర టెక్నీషియన్లకు ఈ ఆటోనగర్‌లో శాశ్వత వర్క్ షాపులు రాబోతున్నాయన్నారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఈ ఆటోనగర్ భవిష్యత్తులో నాగమాంబపురం ప్రజలకు మంచి ఉపాధి కేంద్రంగా ఉంటుందన్నారు. ఈ ప్రాంతం వ్యవసాయానికి పెట్టిందిపేరు కనుక, ట్రాక్టర్ల రిపేర్లు, వ్యవసాయ పనిముట్ల తయారీ లాంటి అవసరాల కోసం ఇటు బుచ్చి అటు కొడవలూరు మండల రైతాంగానికి ఈ ఆటోనగర్ చాలా సౌకర్యంగా ఉంటుందన్నారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో ఆటోనగర్ కోసం కేటాయించిన ఈ భూమిలో విపిఆర్ ఫౌండేషన్ ద్వారా నేల చదును చేస్తున్నామన్నారు. ఏపీఐఐసీ ద్వారా రోడ్లు, విద్యుత్తు, తాగునీరు వసతులు కల్పించి రానున్న రెండు నెలల్లో ఆటోనగర్ నిర్మాణం పూర్తిచేసి, తానే ప్రారంభోత్సవం చేస్తానంటూ ఆమె ప్రజల హర్షధ్వానాల మధ్య తెలిపారు. అదేవిధంగా ఏళ్ల తరబడిగా పరిష్కారం కాని కోవూరు షుగర్ ఫ్యాక్టరీ రైతులు, కార్మికుల సమస్యకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పదినెలల వ్యవధిలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి చొరవతో పరిష్కారం చూపుతున్నందుకు ఆమె ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బుచ్చి మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, బుచ్చి నగర పంచాయతి కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



# క్రీడల్లో మేటిగా రాణించిన..ఎన్‌బికెఆర్ విద్యార్థులు



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్టీ విద్యార్థులు ఇటీవల కడపలో జరిగిన కెఎస్‌ఎన్‌ఆర్ ట్రోఫీలో పాల్గొని తమ సత్తాచాటారు. బాస్కెట్‌బాల్‌లో బి. బిందుమాధవరాజు, సిహెచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, వివి వెంకటశివసాయి శ్రీకర్‌రెడ్డి, ఎం.బాలయ్య, పి.సూర్యప్రకాష్, సి.నాగవిశాంత్, ఆదిత్యశర్మ, ఆర్.సుకేష్‌రెడ్డి, సిహెచ్ వెంకటహవీష్, పి.హర్షవర్ధన్‌ల జట్టు ప్రథమ బహుమతి సాధించింది. అదేవిధంగా, కబడ్డీలో వై.చైతన్య, జి.రేవంత్, కె.హేమసుదర్శన్‌రెడ్డి, పి.కల్యాణ్, పి.మణికంఠ, వి. వెంకటరాహుల్‌రెడ్డి, కె.మునిబాబు, ఆర్.విష్ణువర్ధన్, ఏ.రంగరోహిత్‌రెడ్డి, టి.బాలాజీ, పి.పవన్‌కుమార్, పి.సుమంత్‌కుమార్‌ల జట్టు ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. బాల్‌బ్యాడ్మింటన్‌లో బి.మనోహర్‌రెడ్డి, బి.మొహిందర్, ఆర్.తేజేష్‌రాజు, డి.శ్రీనాథ్, ఎస్. హేమంత్‌కుమార్‌రెడ్డి, కె.ఇంద్రవైభవ్, జి.నవదీప్, కె.కృష్ణమూర్తి జట్టు ప్రథమ బహుమతి సాధించాయని, చెస్‌లో ఏస్.సుభదీప్ ద్వితీయ బహుమతి గెలుచుకున్నాడని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ వి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. విజేతలైన క్రీడాకారులను ఎన్‌బికెఆర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

## కృష్ణపట్నం పోర్టులో..

# అగ్నిమాపక వారోత్సవం

ముత్తుకూరు మండలంలోని అదాని కృష్ణపట్నం పోర్టులో ఈనెల 14న అగ్నిమాపక వారోత్సవ కార్యక్రమం జరిగింది. పోర్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జగదీష్ పటేల్ మాట్లాడుతూ, అగ్నిప్రమాదాల పట్ల ఎంతో జాగ్రత్తగా ఉండాలన్నారు. అందులోనూ ఈ వేసవిలో తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతుంటాయని, కనుక వాటి పట్ల అవగాహనతో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అగ్నిమాపక భద్రత చాలా ముఖ్యమని, ప్రతి ఉద్యోగి, కార్మికుడు భద్రంగా ఉండాలన్నారు. సురక్షితమైన పనివాతావరణాన్ని కల్పించడానికి పోర్ట్‌లో అగ్నిమాపక విభాగం సిద్ధంగా ఉంటుందని, నైపుణ్యం కలిగిన సిబ్బంది అందులో ఉంటారని, వారి అవిశ్రాంత సేవ, అంకితభావం స్ఫూర్తిదాయకమని అన్నారు. పోర్ట్ సీఇఓ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పోస్టర్ల ఆవిష్కరణ



అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఆ శాఖకు సంబంధించిన పోస్టర్లను ఈ నెల 14 జిల్లా రెవెన్యూ అధికారి ఉదయభాస్కరరావు ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.




## సాహితీ సేవోత్సవంగా..

# సినారా అక్షరోత్సవం



ప్రధాన అవార్డును అందుకున్న ప్రముఖ కవి బండారు ప్రసాదమూర్తిని సన్మానిస్తున్న ముఖ్యఅతిథులు

ప్రముఖ కవి, ఆడిటర్ చిన్ని నారాయణరావు(సినారా), ఆయన తనయుడు శ్రావణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఈనెల 13న నెల్లూరు టౌన్‌హాల్ (ఏసీ హాల్)లో జరిగిన ద్వితీయ అక్షరోత్సవం కవిమిత్రుల ఆనందోత్సవంగా జరిగింది. చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ఈ సభకి 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి (ప్రభు) అధ్యక్షత వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ, చిన్ని నారాయణ రావు అక్షర సేవలు అపూర్వమని కొనియాడారు. ఆయన లెక్కల మాంత్రికుడే కాదు.. అక్షర తాంత్రికుడని, ఆడిటర్‌గా.. సాహితీ వేత్తగా 'చిన్ని' సేవలు గొప్పవని అన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, సాహితీవేత్తలు.. కవులు సమాజానికి అపూర్వమైన సేవ చేస్తున్నారని, వారిని ప్రభుత్వంతో పాటు అందరూ ప్రోత్సహించాలన్నారు. సాహితీవేత్తలు సామాజిక ఇంజనీర్లంటూ.. దుర్మార్గులెవరూ కవులు కాలేరని, కవులెప్పుడూ దుర్మార్గులు కారని అన్నారు. తాను సాహితీసేవ చేయడమే కాకుండా, సాహిత్య రంగంలో రాణిస్తున్న కవులను గుర్తించి, సత్కరించి, ప్రోత్సహించడం అభినందనీయమంటూ చిన్ని నారాయణరావుని ప్రశంసించారు. అనంతరం, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కవి బండారు ప్రసాదమూర్తికి ఫౌండేషన్ తరఫున ప్రధాన అవార్డును వారు బహుకరించారు. నారాయణరావుకి, తనకి నేరుగా పరిచయం లేకపోయినా, తనను గుర్తించి నెల్లూరుకు రప్పించి అవార్డుతో సత్కరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇది ప్రభుత్వ అవార్డుగా తాను భావిస్తున్నానంటూ ప్రసాదమూర్తి ప్రతిస్పందించారు.



పురస్కారాలనందుకుంటున్న పి.శ్రీనివాసగౌడ్, కొమ్మవరపు విల్సన్‌రావు, అవధానుల మణిబాబు

కీ.శే సత్యవేటి శ్రీకాంత్ స్మారక పురస్కారాన్ని ప్రఖ్యాత కవి పి.శ్రీనివాస గౌడ్ (హైదరాబాద్)కి బహుకరించారు. ప్రముఖ పాత్రికేయులు..'లాయర్' వార పత్రిక వ్యవస్థాపకులు స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి స్మారక పురస్కారాన్ని ప్రముఖ కవి కొమ్మవరపు విల్సన్‌రావుకి ప్రదానం చేశారు. కీ.శే నాగభైరవ కోటేశ్వర రావు పురస్కారాన్ని ప్రముఖ రచయిత అవధానుల మణిబాబు(కాకినాడ)కి అందజేసి, వారందరినీ ఘనంగా సన్మానించారు. నవ మల్లెతీగ పత్రిక సంపాదకులు కలిమిశ్రీ, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ డా.మాడభూషి సంపత్ కుమార్, పెరసం అధ్యక్షురాలు గోవింద రాజు సుభద్రాదేవి, శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత బయ్యా శ్రీనివాసులు, ప్రముఖ నవలారచయిత శ్రీరామకవచం సాగర్, ప్రముఖ కవి బీరం సుందరరావు. కవయిత్రి ప్రతిమ తదితరులు పాల్గొని కవిగా, ఫౌండేషన్ వ్యవస్థాపకునిగా చిన్ని నారాయణరావు సాహితీసేవలను అభినందించారు. తొలుత కవిసమ్మేళనంలో అనేకమంది కవులు, కవయిత్రులు పాల్గొని తమ కవితాగానంతో సభికులను అలరించారు.

# ఇంటర్‌లో సత్తా చాటారు

## జిల్లాకు రాష్ట్రస్థాయిలో 5, 7 స్థానాలు

ఇటీవల విడుదలైన ఇంటర్‌మీడియట్ ఫలితాల్లో నెల్లూరు జిల్లా విద్యార్థులు తమ సత్తా చాటారు. జూనియర్ ఇంటర్, సీనియర్ ఇంటర్ రెండింటిలోనూ గతంలో కన్నా మెరుగైన ఫలితాలను సాధించారు. ఇంటర్ ద్వితీయసంవత్సర ఫలితాల్లో జిల్లాకు 5వ స్థానం, ప్రథమ సంవత్సర ఫలితాల్లో 7వ స్థానం లభించాయి. ఈసారి మొత్తం 26,272 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 19,282 మంది (73శాతం) ఉత్తీర్ణులయ్యారు. అదేవిధంగా సీనియర్ ఇంటర్‌కి సంబంధించి మొత్తం 22,720 మంది పరీక్షలకు వెళ్లగా, వారిలో 19,848 మంది (87శాతం) పాసయ్యారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది కొంత మెరుగే. జూనియర్ ఇంటర్ ఉత్తీర్ణతల్లో రాష్ట్రస్థాయిలో 8వ స్థానంలో ఉన్న జిల్లా ఈసారి 7వ స్థానానికి చేరుకుంది. సీనియర్ ఇంటర్‌లో కూడా గత ఏడాది 6వ స్థానంలో ఉండగా, ఈసారి 5వ స్థానానికి చేరడం విశేషం.

### మంచి ఫలితాలు సాధించిన హాస్టళ్ళ విద్యార్థులు..

జిల్లాలోని బీసీ, ఎస్సీ వసతి గృహాల్లో చదువుకుంటున్న ఇంటర్ విద్యార్థులు ఈసారి మంచి ఫలితాలనే సాధించారు. బీసీ హాస్టళ్ల విద్యార్థులు మొత్తం 350 మంది ఇంటర్ ప్రథమసంవత్సరం పరీక్షలు రాయగా, వారిలో195 మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 250మంది పరీక్షలకు హాజరుకాగా, 233 మంది ఉత్తీర్ణులయ్యారు. అదేవిధంగా జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉన్న ఎస్సీల హాస్టళ్లలో సీనియర్ ఇంటర్ చదువుతున్న 166 మంది పరీక్షలు రాయగా, 135మంది ఉత్తీర్ణులయ్యారు. వసతులు పెద్దగా లేకున్నా వీరంతా కష్టపడి మంచి ఫలితాలు సాధించడం పట్ల అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ఉపాధ్యాయులు ఇంకాస్త శ్రద్ధ తీసుకుంటే వచ్చే ఏడాది మరింత మెరుగైన ఉత్తీర్ణతలు సాధించవచ్చు.

# సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేటి రోజుల్లో, ప్రతిఒక్కరూ పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని, ఇళ్ళ వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారిణి హుస్సేనమ్మ సూచించారు. నెల్లూరులోని వేదాయపాలెం ఆరోగ్యకేంద్రం పరిధిలో ఉన్న వైద్యారోగ్య సిబ్బందితో ఆమె ఇటీవల సమావేశమై, ప్రజలు వ్యాధులకు గురికాకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండి తగు సూచనలు, సలహాలు ఇస్తుండాలని సూచించారు.




## స్మృత్యంజలి

మానవతామూర్తి, సేవాదీప్తి
మాకందరికీ స్ఫూర్తి, మా కుటుంబ కీర్తి

**చిల్లకూరు రాధాకృష్ణారెడ్డి గారు**
(డాక్టర్ సి.ఆర్.రెడ్డి)

పరమపదించి తేది.24.4.2025 నాటికి రెండేళ్ళు గడవనున్నాయి.
**ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...**

తమ్ముడు - మరదలు
**ఆచార్య సి.యం.కె.రెడ్డి - శ్రీమతి నిర్మల**, చెన్నై

తమ్ముని కుమారుడు - కోడలు
**డా॥ సి.యం.కిషోర్ - శ్రీమతి లీలాదేవి**, చెన్నై

తమ్ముని కుమార్తె - అల్లుడు
**శ్రీమతి హరిత - డా॥ రామానందరెడ్డి**, కాకినాడ

తమ్ముని మనుమలు.. మనుమరాండ్రు
**జయేష్ & అస్మిత** **కీర్తన లక్ష్మి & తనవ్**

జననం : 01.03.1929 నిర్యాణం : 24.04.2023

బడుగు వర్గాల ఆశాజ్యోతి...

# మహాత్మా జ్యోతిరావు పూలే

పోలంరెడ్డి దినేష్‌రెడ్డి నివాళి




సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే బడుగువర్గాల ఆశాజ్యోతి అని, దేశానికి ఆయన చేసిన సేవలు మార్గదర్శకమని ఏపీఇఎంసిఎల్ ఛైర్మెన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి చెప్పారు. మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఇఎంసిఎల్) కార్యాలయంలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పూలే సేవలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. దేశంలో అంటరానితనం, కుల వివక్ష నిర్మూలన కోసం పూలే అలుపెరుగని పోరాటం చేశారని, ముఖ్యంగా స్త్రీ విద్య కోసం పూలే దంపతులు చేసిన సేవలు మహిళా శక్తీకరణకు పునాది అని అన్నారు. సమానత్వం కోసం, విద్యావికాసం కోసం ఆ మహనీయుని సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. కార్పొరేషన్ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొని పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

# శ్రీసిటీలో విద్యుత్ వినియోగదారుల సదస్సు



అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ప్రముఖ పారిశ్రామికవాడ శ్రీసిటీలో ఇటీవల పరిశ్రమలకు సంబంధించి విద్యుత్ వినియోగదారుల సదస్సు జరిగింది. ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఏపీఎస్పీడీసీఎల్)-తిరుపతి సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.సురేంద్రనాయుడు పాల్గొని విద్యుత్ వినియోగం, సరఫరా, ఇతర విద్యుత్ సమస్యలపై పరిశ్రమల ప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా పరిశ్రమ వర్గాల వారు అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. విద్యుత్ సరఫరా అంతరాయాన్ని అరికట్టి, మెరుగైన సరఫరా అందించడంపై ట్రాన్స్‌కో-పుత్తూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, స్థానిక విద్యుత్‌శాఖ ఏడీలు, ఏఈలకు పలు సూచనలు చేశారు.

# పార్కిన్సన్స్ వ్యాధితో జాగ్రత్త

అపోలో వైద్యులు




ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నాడీ సంబంధిత రుగ్మతలలో ఒకటైన పార్కిన్సన్స్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నెల్లూరులోని అపోలో వైద్యులు చెప్పారు. ప్రపంచ పార్కిన్సన్ వ్యాధి నివారణ దినం సందర్భంగా ఇటీవల ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆసుపత్రి డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, అపోలో ఆసుపత్రి న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ బిందు మీనన్, న్యూరాలజిస్టులు డాక్టర్ రష్మీ, డాక్టర్ ముత్తరాజు శివ శంకర్‌లు ఈ వ్యాధి పట్ల రోగులకు అవగాహన కలిగించారు. ఈ వ్యాధిని ముందస్తుగానే గుర్తిస్తే నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా వృద్ధుల్లో ఈ వ్యాధి ప్రభావం ఎక్కువగా ఉంటోందన్నారు. వైద్యులను సంప్రదించి ఎప్పటికప్పుడు చికిత్సలు చేయించుకోవడం ద్వారా వ్యాధి తీవ్రతకు గురికాకుండా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అపోలో ఆసుపత్రి యూనిట్ హెడ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం తడిసి.. రైతుల దిగాలు!

● ఆదుకుంటామన్న సోమిరెడ్డి



ఇటీవల అకాలవర్షంతో వెంకటాచలం మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం తడిసిపోవడంతో రైతులు దిగాలు పడిపోయారు. ఆ సమాచారం తెలుసుకున్న సర్వేపల్లి ఎమ్మెల్యే, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆ మండలంలోని ఈదగాలి, తాటిపర్తిపాళెం, పూడిపర్తి గ్రామాల్లో రైతులను కలిసి మాట్లాడారు. రైతులు దిగులుపడాల్సిన అవసరం లేదని, రైతుల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అకాల వర్షాలతో ఒక్కో గ్రామంలో వేలాది పుట్ల ధాన్యం తడిసిపోయిందని, ఆ ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలన్నా ఖర్చులు తడిసిమోపెడవుతాయని, ధాన్యం కూడా రంగు మారడంతో ఆ ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కష్టాల్లో ఉన్న రైతులకు తప్పకుండా న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# తలసీమియా చిన్నారులకు..వేమిరెడ్డి సాయం



నెల్లూరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ- జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉన్న తలసీమియా కేంద్రంలో ఆ ప్రాణాంతక వ్యాధికి చికిత్స పొందుతున్న 2 నుండి 8 సంవత్సరాల వయసున్న ముగ్గురు చిన్నారుల బోన్ మ్యారో శస్త్ర చికిత్సలకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన సహాయసహకారాలు అందించారు. దండు ఆదర్స్, వెల్లసిరి ప్రణీత, మల్లవరం రిత్విక్‌లు తలసీమియా వ్యాధికి గురై బాధపడుతుండడాన్ని గమనించి వారికి అత్యవసరమైన బోన్‌మ్యారో శస్త్ర చికిత్సల కోసం సాయం అందించినట్లు రెడ్‌క్రాస్ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, తలసీమియా సెంటర్ కన్వీనర్ డాక్టర్ ఎస్.స్వేత ఒక ప్రకటనలో తెలిపారు. తలసీమియా చిన్నారుల ఖరీదైన వైద్యానికి బెంగళూరులో ఉన్న సంకల్ప ఫౌండేషన్ వారు కూడా సహకరించారని, ఒక్కొక్కరికి దాదాపుగా రూ.35 లక్షలు ఖర్చయ్యే ఈ శస్త్రచికిత్సను బెంగళూరులోని మహావీర్ జైన్ హాస్పిటల్ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయన్నారు. చిన్నారుల వైద్యానికి సహకరించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి, సంకల్ప ఫౌండేషన్ వారికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ముగ్గురు చిన్నారులు శస్త్ర చికిత్స అనంతరం త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

# ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో..డా. అంబేద్కర్ జయంతి



భారత రాజ్యాంగ నిర్మాత డా.బిఆర్ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని ఈనెల 14న నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ వారు వేడుకలు జరిపారు. తొలుత, అసోసియేషన్ ప్రతినిధులు డా.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. భారత రాజ్యాంగాన్ని ప్రపంచమంతా కొనియాడదగినట్లుగా రూపొందించడం డా.అంబేద్కర్ ప్రతిభాపాటవాలకు నిదర్శనమని అసోసియేషన్ కార్యదర్శి జి.నారాయణరెడ్డి ప్రశంసించారు. భారతీయులందరూ గర్వించదగిన రాజ్యాంగాన్ని రచించిన ఘనత డా. అంబేద్కర్‌కే దక్కిందని అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులునాయుడు, ప్రపంచంలో 64 సబ్జెక్టులలో మాస్టర్ డిగ్రీ పొందిన ఏకైక భారతీయుడు డా. అంబేద్కర్ అని అసోసియేషన్ గౌరవ సలహాదారుడు.. 203 డిస్ట్రిక్ట్ ఎలెక్ట్ గవర్నర్-2025 నలుబోలు బలరామయ్యనాయుడు డా.అంబేద్కర్ ప్రజ్ఞావిశేషాలను తెలియజేశారు. అసోసియేషన్ కోశాధికారి మాగంటి ప్రసాద్, ప్రతినిధులు హరిబాబు, వెంకటేశ్వర్లు, నజీర్ అహ్మద్, సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, చెంచయ్య, శివయ్య, సుబ్బరాయుడు, రామమోహన్‌రెడ్డి, మస్తాన్‌బాషా, పుల్లయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ తవ్వకాలపై ప్రత్యేక నిఘా

అక్రమ తవ్వకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశామని, అనుమతులు లేకుండా ఎవరైనా తెల్లరాయి తవ్వకాలు జరిపితే కఠినచర్యలు తప్పవని జిల్లా అటవీశాఖ అధికారి మహబూబ్ బాషా హెచ్చరించారు. సైదాపురంలో కొత్తగా ఏర్పాటుచేసిన నర్సరీని ఆయన ఇటీవల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని అటవీప్రాంతాల్లో ఉన్న ఖనిజాలను అక్రమంగా తవ్వుకుపోకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. నెల్లూరు అటవీశాఖ రేంజర్ మాల్యాద్రి, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

## టూకీగా...



### కృష్ణపట్నంలో ఉచిత మెగా వైద్యశిబిరం

గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలందించాలనే లక్ష్యంతో, ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలో ఈనెల 13న తత్వజ్ఞ ఆసుపత్రి వారు మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఆసుపత్రి అధినేత..ప్రముఖ వైద్యులు కె.తిరుమల ఆధ్వర్యంలో 148 మంది గ్రామస్తులకు ఉచితంగా ఆరోగ్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.

### బిట్రగుంటలో ఆటల పోటీలు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 13న బోగోలు మండలం బిట్రగుంటలో ఆటల పోటీలు జరిగాయి. అంబేద్కర్ యూత్ కమిటీ ప్రతినిధులు గడ్డం రమేష్, దాసరి సునీల్, సుధ, ఎస్‌కె నూరుద్దీన్, నీలం సుబ్రహ్మణ్యం, సురేష్, అశోక్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. అనంతరం, 14వ తేదీన విజేతలకు బహుమతులిచ్చారు.

### సీతారామపురంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సీతారామపురం మండలంలోని సంజీవరెడ్డినగర్, బాలాయపల్లి, బెడుసుపల్లి, నాగరాజుపల్లి, మారంరెడ్డిపల్లిల్లో ఈనెల 13న రూ.35 లక్షల వ్యయంతో రోడ్ల నిర్మాణాలకు, మంచినీటి వనరుల ఏర్పాటుకు శంకుస్థాపనలు చేశారు. ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి భూమిపూజ చేశారు. వైకాపా నాయకులు చింతంరెడ్డి సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

### రామానాయుడుపల్లిలో కూలిపోయిన విద్యుత్‌స్తంభాలు

ఈనెల 13న వీచిన ఈదురుగాలుల ధాటికి మర్రిపాడు మండలం రామానాయుడుపల్లిలో పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో, విద్యుత్ సరఫరా ఆగిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. శ్రీరామనవమి వేడుకలు జరుగుతుండగా కరెంటు పోవడంతో ఆలయ ప్రాంగణమంతా చీకట్లు ఆవరించి భక్తులు అవస్థలకు గురయ్యారు.

### కావలిముస్తాపురంలో కరెంట్‌షాక్‌తో రైతు మృతి

కలిగిరి మండలం కావలిముస్తాపురంలో ఇటీవల జామాయిల్‌తోటలో పనిచేస్తుండగా, ప్రమాదవశాత్తూ విద్యుత్‌తీగలు చేతికితగిలి నంబూరి చెంచునాయుడు(60) అనే రైతు దుర్మరణం పాలయ్యాడు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులున్నారు. ఇంటిపెద్ద మృతితో ఆ కుటుంబం శోకసాగరంలో మునిగిపోయింది.

### వేదగిరి నరసింహునికి తిరుప్పావడ సేవ

నెల్లూరురూరల్ మండలంలోని నరసింహకొండపై వెలసి వున్న శ్రీ వేదగిరి లక్ష్మీనృసింహస్వామికి అర్చకబృందం ఈనెల 14న తిరుప్పావడ సేవ ఘనంగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా ఈ వేడుక జరిపారు. మూలవిరాట్‌కు స్నపన తిరుమంజనం చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఇఒ గోపి పర్యవేక్షించారు.

### పెంచలకోనలో నిత్యాన్నదానానికి విరాళం

రాపూరు మండలం పెంచలకోనలో కొలువైవున్న శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి తిరుపతికి చెందిన వాసిలి పెంచలప్రవీణ్-శిరీష దంపతులు లక్షా పదకొండువేలా నూటపదహారు రూపాయలను విరాళంగా సమర్పించారు. ఈనెల 12న ఆ మొత్తాన్ని దేవాలయ అసిస్టెంట్ కమిషనర్ పొర్రెడ్డి శ్రీనివాసులురెడ్డికి అందజేశారు.

### సౌత్‌రాజుపాళెంలో పేకాటరాయుళ్ళ అరెస్ట్

నెల్లూరురూరల్ మండలం సౌత్‌రాజుపాళెంలోని ఓ పేకాటస్థావరంపై ఇటీవల సీఐ వేణు ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేసి, అక్కడ పేకాటాడుతున్న 10మందిని పట్టుకుని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 18,830 రూపాయలతో పాటు, 10 సెల్‌ఫోన్లు కూడా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

### ఇస్కపాళెం స్కూల్‌కి నీటిశుద్ధి పరికరం వితరణ

వెంకటాచలం మండలం, ఇస్కపాళెం ప్రాథమిక పాఠశాలకు ఇటీవల రైజ్ సంస్థ డైరెక్టర్ దివ్య రూ.18వేల విలువచేసే నీటిశుద్ధి పరికరాన్ని వితరణగా ఇచ్చారు. పాఠశాల హెడ్మాస్టర్ పార్వతీశం, నిడిగుంటపాళెం హెడ్మాస్టర్ చలపతి పాల్గొన్నారు.

# చదువుల పరుగులో.. సమిధలు

**సమాజంలో ఒకరి భావాలను మరొకరికి తెలియజేసేందుకు ఏర్పడిన ధ్వని సంకేతాల నియత నిర్మాణం భాష. అలాంటి భాషా నైపుణ్యాలను పెంచడంతో పాటూ శారీరక, మానసికోల్లాసాన్ని కలిగించి, అంతర్గతంగా దాగున్న ప్రతిభాపాటవాలను వెలికితీసే మహత్తర సాధనం విద్య. అయితే ప్రస్తుతం ర్యాంకులు, మార్కుల సుడిగుండంలో పడి గాడి తప్పిన విద్యావ్యవస్థ రోజురోజుకూ పతనావస్థకి చేరుకుంటోందనే వాదనలు వినిపిస్తున్నాయి. తద్వారా సృజనాత్మకత కలిగిన భావిభారత పౌరులను తయారుచేయాల్సిన విద్య, అన్నెంపున్నెం ఎరుగని విద్యార్థుల జీవితాలను మిథ్యగా మారుస్తూ, చివరికి వారి ప్రాణాలనే హరిస్తోంది.**



- విద్యావ్యవస్థలో లోపించిన పారదర్శకత
- ఏటా పెరుగుతున్న అభాగ్యుల ఆత్మహత్యలు

అజ్ఞానాన్ని పారద్రోలి ప్రగతిశీల ఆలోచనలకు నాంది పలకడం, నవతరానికి నవీన నైపుణ్యాలను అలవరచడమే చదువు లక్ష్యం. అంతేకాక జీవితం పట్ల ఆశావాహ దృక్పథాన్ని, జీవన మార్గాన్ని నిర్దేశించుకునే తెలివిని, దాన్ని చేరుకునే దృఢచిత్తాన్ని భావితరానికి అందించడం విద్య పరమార్థం. కానీ మన దేశంలోజరుగుతున్నదేంటి? మూస పాఠాలు, బండ బోధనా పద్ధతులకు తోడు ర్యాంకుల ఉన్మాద రేసులో విద్యార్థులు మానసికంగా నలిగిపోతున్నారు. ఆ నిస్సహాయ స్థితిలో బలవన్మరణాలకు ఒడిగడుతున్నారు. చదవలేకపోతున్నా, నాకు తెలియకుండానే కోపం, భయం పెరిగిపోతున్నాయి... అంటూ విద్యార్థులు జీవితాలను అర్థాంతరంగా ముగించేస్తున్నారు.

## ఫలితాలు రాగానే.. బలవన్మరణాలు


పదోతరగతి, ఇంటర్ ఫలితాలు రాగానే ఏటా ఎంతోమంది పిల్లలు తనువు చాలిస్తున్నారు. ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఎంలనూ ఆత్మహత్యలు వెంటాడుతున్నాయి. విద్యార్థుల వ్యక్తిగత సామర్థ్యాలను పట్టించుకోకుండా అందరినీ ఒకే తూనిక రాళ్లతో కొలవడం, మార్కులు రాని వాళ్లను చులకనగా చూడడం ఎన్నో కుటుంబాల్లో చిచ్చును రగిలిస్తూ దేశానికే తీరని నష్టం చేస్తోంది. ప్రతి విద్యార్థిలోనూ ఏదో ఒక ప్రత్యేక ప్రతిభ దాగుంటుంది. ఎదిగే క్రమంలో కొన్ని రంగాలపై వారికి ఆసక్తి కలుగుతుంది. వాటిని గుర్తించి ప్రోత్సహిస్తే పిల్లలు అనుకున్న దానికన్నా అద్భుతంగా రాణిస్తారు. అలాకాకుండా తల్లిదండ్రులు, బంధుమిత్రుల ఒత్తిడితో బలవంతంగా నాలుగు ముక్కలు బట్టీపట్టి ప్రతిష్టాత్మక సంస్థలో సీటు సాధించినా సరైన మానసిక స్థిరత్వం లేనివారు అక్కడ నెగ్గుకురాలేరు. ఇష్టంలేని చదువు పిల్లల్లో మానసిక వికాసాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచలేదు. ఆసక్తిలేని కోర్సులు చేసిన చాలామంది ఈ కారణం వల్లే గెలుపురుచి చూడలేకపోతున్నారు. ఆ పరాజయ భారంతో ఆయువు తీసుకుంటున్నారు.

## తల్లిదండ్రుల్లో మార్పు రావాలి..

తల్లిదండ్రులు తమ బిడ్డలకు తోడుగా ఉంటూ వారి ఊహలకు రెక్కలివ్వాలి. చ దువుల చదరంగంలో ప్రాణదీపాలు కొండెక్కకూడదంటే పరీక్షల పద్ధతిని మార్చి అభ్యసన ఆధారిత మూల్యాంకనంతో విద్యార్థుల నైపుణ్యాలను బేరీజు వేయాలి. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తక్షణం పరిష్కరించే వ్యవస్థలను అన్ని విద్యా సంస్థలు, శిక్షణ సంస్థల్లో కొలువుదీర్చాలి. ఉచిత మానసిక ఆరోగ్య సేవలందించే టెలీ మానస్ టోల్ ఫ్రీ నంబరుపై విస్తృత అవగాహన కల్పించడమూ కీలకమే.

అదే సందర్భంలో చిన్నతనం నుంచే ఒత్తిడిని తట్టుకునేలా పిల్లల్లో ప్రతిభాపాటవాలను ప్రోత్సహించాలి. ఇందుకోసం వారికి చిన్నప్పటి నుంచే చదువులతో పాటు ఆట పాటల్లో తర్ఫీదు ఇవ్వాలి. ఓటమిని తట్టుకోవడంతో పాటూ దాన్ని విజయానికి మెట్లుగా మార్చుకునే నేర్పును అందింపుచ్చుకునేలా విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావాలి. ఆరోగ్యవంతమైన శరీరంతోనే పరిశోధనాత్మక ఆలోచనలు, విచక్షణాత్మక వ్యవహారశైలి అలవడుతాయని విద్యావేత్తలు సూచిస్తున్నారు. ఇందులో భాగంగా శారీరక ఆరోగ్యం కోసం విద్యార్థులకు కరాటే, మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇవ్వాలని తేల్చిచెబుతున్నారు.

విన్నింగ్ స్పిరిట్‌తో పాటు, పరాజయాన్ని తట్టుకుని అధిగమించే సామర్థ్యాన్ని పెంపొందించేలా పాఠ్య ప్రణాళికలో మార్పులు తీసుకురావాలని, అప్పుడే భావిభారతానికి బంగారుబాటలు పడుతాయని చెబుతున్నారు. ప్రభుత్వాలు, ప్రజలు, తల్లిదండ్రులు ఆ దిశగా ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com